
ప్రజాశక్తి
పశ్చిమగోదావరి

శుక్రవారం
జనవరి - 5
2018
12 పేజీలు



పందెం కోళ్లకు కళ్లెం పడేనా..!

ఆపి తీరాల్సిందేనని హైకోర్టు స్పష్టీకరణ

గత సంవత్సరం చర్యలపై నివేదిక కోరడంతో గుబులు

సంప్రదాయ ముసుగులో పందేల నిర్వహణకు రంగం సిద్ధం


తెరపైకి ప్రముఖులు రాకుండా జాగ్రత్త

ఆచరిస్తారా.. ఆడిస్తారా..!

రాజకీయ నేతలు, బడా నేతల అండదండలతో పందెం కోడి కాలు దువ్వుతోంది.. పందేలు ససేమిరా కుదరవని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సంక్రాంతికి పందేలు ఆగుతాయా.. లేక వేరే పద్ధతుల్లో పందెం రాయుళ్లు ముందుకు సాగుతారా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. గత సంవత్సరం పందేలు కట్టడి చేయలేకపోవడంపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మమ్మల్ని బలి పశువులను చేస్తారా? అని పోలీసు, రెవెన్యూ, దిగువస్థాయి సిబ్బంది గుర్రుమంటున్నారు. మొత్తానికి ఈ సంక్రాంతి పండుగ పలు పరిణామాలకు వేదిక కాబోతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ప్రజాశక్తి - పశ్చిమడెస్క్

కోడి పందేలపై హైకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అంతటితో ఆగకుండా డిజిపి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని బాధ్యులుగా చేస్తామని హెచ్చరించడంతో పాటుగా గత సంవత్సరం పందేలు నిలువరించని సిబ్బందిపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు ఇటు పందెం రాయుళ్లలో, అటు ప్రభుత్వ యంత్రాంగంలో కలవరం పుట్టిస్తుంది. ఈ నేపథ్యంలో పందేలు ఏ రూపంలో నిర్వహించాలనే దానిపై నేతలు, పందేల నిర్వాహకులు తర్జన భర్జనలు పడుతుంటే తమపై చర్యల్లేకుండా ఏ విధంగా పందేలను అడ్డుకోవాలనే దానిపై పోలీసు, రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు తమ పరిధిలో కోడి పం దేలు నిర్వహించే బరులను గుర్తించి అక్కడ నిఘా ఉంచడంతో పాటు కోడిపందేలు నిర్వహించరాదని ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో నిర్వాహకులుగా ఉన్న వారిని పిలిచి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇక రెవెన్యూ యంత్రాంగం కూడా జన్మభూమి సభల్లోనూ, (4లో)



వీరవాసరంలో ఎండుతున్న నారుమడులు

ఆదిలోనే హంసపాదు..!

ప్రారంభంలోనే నీటిఎద్దడి - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - వీరవాసరం

దాళ్వా సీజన్ ప్రారంభంలోనే సాగునీటి ఎద్దడి రైతులను వేధిస్తోంది. దీంతో వరి రైతులు దాళ్వా పంట చేతికొచ్చే వరకూ ఎన్ని ఇబ్బందులు పడాలోనని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సాగునీటి సంఘాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయని, సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. సాగునీటి కొరతను అధిగమిస్తామని అధికారులు పదేపదే ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది.

వీరవాసరం పరిధిలో తలతాడితిప్ప వెళ్లే మార్గంలో పుట్టకోడు ఆయకట్టు, బాలేపల్లి, మెంటేపూడి, బొబ్బనపల్లి, మత్స్యపురి ఆయకట్టుల్లో ఇప్పటికే సాగునీరు అందక నారుమడులు బీటలు తీస్తున్నాయి. ఒకసారి దమ్ము పూర్తయిన చేలు సైతం ఎండిపోతున్నాయి. మండలంలో వీరవాసరం పశ్చిమ కాలువపై సుమారు ఏడు వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. కాలువ శివారు గ్రామాలైన మత్స్యపురిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వంతులవారీ విధానంలోనూ సాగునీరందని దుస్థితి నెలకొందని ఇక్కడి రైతులు అంటున్నారు. దీనికి కాలువ వెంబడి రొయ్యల చెరువులు తవ్వడమే కారణమని చెబుతున్నారు. కాలువ ఎగువ భాగంలో వంతులు పూర్తయిన తర్వాత తమ వంతుకు విడుదల చేసిన నీటిని ఎగువ భాగంలో ఉన్న ఆక్వా రైతులు చెరువులకు మళ్లించేసుకోవడంతో తమ పొలాలకు సాగునీరదండం లేదని రైతులు అంటున్నారు. వీరవాసరం పశ్చిమ కాలువపై వీరవాసరం, మెంటేపూడి, పెర్కిపాలెం, శృంగవృక్షం ప్రాంతాల్లో డ్యామ్‌లు ఉన్నాయి. గతంలో ఈ డ్యామ్‌లకు వారంలో 12 గంటల చొప్పున వంతు కేటాయించి ఎగువభాగంలో ఆయకట్టు నీటిని మళ్లించేవారు. మిగిలిన సమయంలో కిందకి వదిలేవారు. అయితే ప్రస్తుతం ఈ సమయం 24 గంటలకు పెంచడం వల్ల వారంలో నాలుగు రోజులు కాలువ ఎగువ భాగంలో ఉన్న ఆయకట్టుకు సాగు నీరు మళ్లించి మిగిలిన మూడు రోజులు (4లో)


శివారు ఆయకట్టును పట్టించుకోవడం లేదు

చింతా నారాయణమూర్తి, మత్స్యపురి



కాలువ శివారు ఆయకట్టును అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. గతంలో కాలువ పూడిక తీయక సాగు నీరందని దుస్థితిని ఎదుర్కొనే వాళ్లం. కాల్వ తవ్విన తరువాత కూడా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మాకు కేటాయించిన నీటిని చెరువులకు మళ్లించుకుంటున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళన చేపడతాం.

గీతోపదేశం



వెంట్రుక.. ముక్కేకదాని..తీసిపారేస్తారేమో... అనుకున్నాట్ట...!!!

కోమట్లపాలేనికి తాగునీరివ్వరా..!

జన్మభూమి సభలో అధికారులను నిలదీసిన జనం

ప్రజాశక్తి - గణపవరం

తమకు తాగునీరు అందించినా పలుమార్లు సభల్లో కోరినా, వినతిపత్రాలు ఇచ్చినా ఎందుకు పట్టించుకోవడం లేదని మండలంలోని కోమట్లపాలెం గ్రామస్తులు అధికారులను నిలదీసిన సంఘటన గురువారం జన్మభూమి సభలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కలుషిత నీటి సమస్యపై గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలోని కొత్త పంట కాల్వను ఆనుకుని ఇష్టారాజ్యంగా చేపలు, రొయ్యల చెరువులు తవ్వారని పేర్కొన్నారు. ఈ కాల్వ ద్వారానే మంచినీటి చెరువుకు నీరు రావాల్సి ఉందని (4లో)



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మహిళా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న 80 వేల మంది మహిళా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరులో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా జరిగిన మహిళా ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని సాబ్జీ మాట్లాడారు. మహిళా టీచర్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినులకు అమలు చేస్తున్న రెండేళ్ల ఛైల్డ్‌కేర్ లీవును మంజూరు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో శిశు సంరక్షణాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. పనిచేసే ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టాలని, పాఠశాలల్లో ప్రత్యేక స్టాఫ్ రూమ్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కనకదుర్గ, జిల్లా అధ్యక్షులు పి.జయకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి.నరసింహారావు, జిల్లా మహిళా కార్యవర్గ సభ్యులు ఆర్.సుధారాణి, కె.విజయలక్ష్మి, మాలతి, షేక్ సుభాని బేగం, కామాక్షమ్మ, వెంకటేశ్వరమ్మ, పూర్ణశ్రీ, రాజ్యలక్ష్మి, అలివేలు మంగతాయారు, అపర్ణ, మేరీ ఎలిజబెత్, ఉషారాణి పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సంక్షేమ పథకాల అమలు : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రం విడిపోయి లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు అన్నారు. వెలివెల, కాపవరం, వరిధనం గ్రామాల్లో గురువారం జన్మభూమి గ్రామ సభలు నిర్వహించారు. ఆ గ్రామ సర్పంచి వీరల్లి రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌సి అంగర మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, తహశీల్దార్ దాసిరాజు, ఎంపిటిసి శ్రీదేవి, జెడ్‌పిటిసి సభ్యులు కోడి విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఎఇ వర్ధనపు శ్యాంబాబు, వీరవల్లి శివన్ ఆదినారాయణ, ఎంపిటిసి దొమ్మేటి ఏసుదాసు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులకు పింఛన్ల పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రతినెల వృద్ధ కళాకారులకు పింఛను ఇవ్వడం, వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేయడం అభినందనీయమని కౌన్సిల్లో ప్రతిపక్ష నేత యడ్ల తాతాజీ అన్నారు. గురువారం స్థానికంగా పది మంది వృద్ధ కళాకారులకు రూ.500 చొప్పున రూరల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కొలుకలూరి జయప్రకాష్ నారాయణ అందజేస్తున్న పెన్షన్‌ను వృద్ధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ వడయార్, చినమిల్లి గణపతి, కొప్పర్తి సూర్యనారాయణ, కొండేటి తిరుమలరావు, శర్మ, వింజరపు శంకరం పాల్గొన్నారు.

'జన్మభూమి-మా ఊరు' వాయిదా

ప్రజాశక్తి - మొగల్తూరు

ఐదో తేదీన జరగాల్సిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు వాయిదా పడినట్లు ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కెపిపాలెంనార్త్, కెపిపాలెం సౌత్‌లో నిర్వహించే ఈ కార్యక్రమాలు ఎనిమిదో తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ పర్యటనను పురస్కరించుకుని వాయిదా వేసినట్లు చెప్పారు.

వియ్యర్ ఛానల్ పనులు వేగవంతం చేయాలని వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు నుండి పేరుపాలెం వరకూ జరుగుతున్న వియ్యర్ ఛానల్ పనులను వేగంగా పూర్తిచేయాలని మోడిలో గురువారం నిర్వహించిన జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో జనసేన నాయకులు, బిజెపి నాయకులు అధికారులకు వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమాలను మోడిలో ఎంఇఒ చీర్ల లక్ష్మణప్రభాకర్, ముత్యాలపల్లిలో సర్పంచి కొపనాతి పల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలను, రేషన్‌కార్డులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిటిసిలు బంధన మహాలక్ష్మిరావు, బొక్కా వెంకటలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి సంకు మురళీకృష్ణ, ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ శ్రీపాద హరినాథ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కాపులను బిసిల్లో చేర్చొద్దు'

ప్రజాశక్తి - పాలకొల్లు

కాపులను బిసి జాబితాలో చేర్చే ఆలోచనను విరమించుకోవాల్సిందేనని బిసిసంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి చినమిల్లి గణపతి అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిసి సంఘం రాష్ట్ర నాయకులు ముద్దాడ గణేష్‌భవాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు కొప్పర్తి సూర్యనారాయణ, కాగిత సూర్యనారాయణ, కొలుకలూరి అర్జునరావు, కొలుకలూరి జయప్రకాష్, ఈదనంశెట్టి సత్యప్రసాద్, బెజ్జవరపు నాగరాజు, జిఎస్ఎన్.రవి, వందరపు శ్రీనివాస్, గిరిజాల ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పోడూరు



శ్యామ్ శివరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎంవి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని జిన్నూరులో గురువారం యుటిఎఫ్ మండల శాఖ ఆఫీస్ వర్కర్స్ సమావేశం మండల శాఖ అధ్యక్షులు జె.వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడో తేదీన పాలకొల్లులో జరిగే అమరజీవి ఎన్ఆర్ పొలిశెట్టి వర్ధంతి సభకు రాష్ట్ర అధ్యక్షులు సాబ్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గోపిమూర్తి హాజరవుతారని, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు కోరుతూ తొమ్మిదో తేదీన పాత తాలూకా కేంద్రాల్లో జరుగు ధర్నాల్లో ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్యామ్ శివరావు దంపతులచే మండల ఉపాధ్యాయులకు బహూకరించిన సెలవు దరఖాస్తు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం వారిని వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎకెవి రామభద్రం, గౌరవ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు, సహాయ అధ్యక్షులు ఆర్.గోవింద్, సిహెచ్.చిట్టి బుల్లెమ్మ, కోశాధికారి డి.క్షేమమూర్తి, కార్యదర్శి తాతాబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు పరిశీలన

పెనుగొండ: పెనుగొండ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్లను భీమవరం ఆర్అండ్‌బి అధికారి నాగవర్మరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యతాప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇలు రామరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

తాగునీటికోసం ఖాళీ బిందెలతో నిరసన

నరసాపురం:మున్సిపల్ కుళాయిల నుండి నీరు రావడం లేదని సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. పట్టణంలోని 29వ వార్డు మురుగుకాలువ గట్టున మున్సిపల్ కుళాయి పైపు పగిలిపోయి నీరు రాక 30 కుటుంబాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పైపును మురుగు కాలువ వైపు నిర్మించడం వల్ల వర్షాకాలం వస్తే పైపు మునిగిపోయి నీరు పట్టుకునే పరిస్థితి లేదన్నారు. ఉన్న పైపులో నుండి నీరు రావడం లేదని, మున్సిపల్ అధికారులకు, జన్మభూమిలో చెప్పినా ప్రజల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణం మున్సిపల్ అధికారులు స్పందించి నూతనంగా పైపును నిర్మించి తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుమాని మృత్యుంజయ, డేవిడ్, తిరుమాని విమల, బేబి, టి.రామకృష్ణ, సవిరిగాని సింహాచలం, శ్రీలంకి పార్వతి, ఎల్.అంజిబాబు, కంబాడి కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నరసాపురం మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

ఎస్ఎఫ్ఐ నరసాపురం నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తుమ్మా దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నరసాపురంలోని మీరా గ్రంథాలయంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు తుమ్మా దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. అనంతరం సమావేశం మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నరసాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వై.వెంకటప్రదీప్, పోతుమోని తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి.నరసింహ, టి.అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎల్.వంశీ, పి.వాసు, కమిటీ సభ్యులుగా సాయిరాం, పి.రవితేజ, ఎ.సాయి, కె.నాగేంద్ర, పి.దుర్గశ్రీను, సిహెచ్.క్రాంతికుమార్, టి.శివకృష్ణ, ఎం.రమ్య, ఎం.పౌలు, ఓలీవ్, నరేష్, పవన్‌కుమార్, సాయికుమార్ సహా మొత్తం 19 మందితో కమిటీ ఎన్నికైందని తెలిపారు.

పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన దిగమర్రులో ఒడిఎఫ్, పరిశుభ్రత పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి పచ్చదనం, వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డివిఎస్.లక్ష్మి, సిహెచ్.సుందర్‌సింగ్, కెఎస్‌వి.రంగారావు, శైలజ, లలిత, ప్రమీలరాణి పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

పాలకొల్లు:జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన దిగమర్రులో ఒడిఎఫ్, పరిశుభ్రత పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి పచ్చదనం, వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి : బండారు

మొగల్తూరు: ఈ నెల 5న మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు ఆ పార్టీ నాయకులకు సూచించారు. లోకేష్ ప్రారంభించనున్న సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని ఎంఎల్ఎ గురువారం పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. శుక్రవారం ఉదయం నరసాపురంలో పలు కార్యక్రమాలను ఎంఎల్ఎ ప్రారంభించి అనంతరం సీతారామపురం మీదుగా మొగల్తూరు రామాలయం సెంటర్, కోట మీదుగా ఆయన ప్రారంభించనున్న తాగునీటి పథకం వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడ నుండి స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

చౌకడిపోలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - లింగపాలెం

లింగపాలెం మండలంలో గురువారం విజిలెన్స్ అధికారులు చౌకడిపోలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టిసిహెచ్ఆర్ పాలెంలోని ఎనిమిదో నంబరు చౌకడిపోలో 15 క్వింటాల్ బియ్యం, కొత్తపల్లిలోని 19వ నంబర్ చౌకడిపోలో క్వింటా బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ రెండు దుకాణాలపై 6ఎ కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యాని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారని తహశీల్దార్ సోమశేఖర్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - నరసాపురం

సరిహద్దు గొడవల్లో మందలించి నందుకు తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి నరసాపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన బాలం సువర్ణరాజు (69), బాలం బాబులకు కొంతకాలంగా సరిహద్దు గోడ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఈ విషయంపై బాలం బాబులు, సువర్ణరాజును మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సువర్ణరాజు గురువారం తన ఇంటి సమీపంలో ఉన్న మునగచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సువర్ణరాజు కుమారుడు సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

యువకుడు అదృశ్యం

నరసాపురం:తాపీపనుల కోసం జిల్లాలోని నరసాపురానికి వచ్చిన తన కుమారుడు అదృశ్యమయ్యాడని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన వెంకటేశ్వరరావు కొద్ది నెలల క్రితం తాపీపనుల నిమిత్తం నరసాపురానికి వచ్చాడు. అయితే అతను ఇంటికి వెళ్లిపోతానని చెప్పి కొద్దిరోజుల క్రితం బయలుదేరాడు. ఎన్ని రోజులైనా అతను ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన అతని కుటుంబ సభ్యులు నెలరోజుల నుండి వెంకటేశ్వరరావు గురించి వెతకడం ప్రారంభించారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో నరసాపురం పట్టణ పోలీసులకు నరసాపురం ఫిర్యాదు చేశారు. దీనిపై నరసాపురం పట్టణ ఎస్ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ప్రాంతం.. మందుబాబుల అడ్డా..!

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అది జిల్లా కలెక్టర్ కార్యాలయం.. ఆ పక్కనే ఇరిగేషన్ కార్యాలయం.. ఆ పక్కనే పోలీసుక్వార్టర్స్.. ఆ ప్రాంతంలోకి రావాలంటే ఇతరులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు.. కానీ ఇక్కడ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. నిత్యం చీకటిపడితే చాలు ఈ ప్రాంతమంతా మందుబాబులతో నిండిపోతుంది. తెల్లవారితే చాలు పూటుగా తాగిన తర్వాత వదిలేసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, తినిపడేసిన కాగితాలు కనిపిస్తాయి..

కలెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రహరీ మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ ప్రతిరోజూ చీకటిపడితే చాలూ మందుబాబులు చెలరేగిపోతున్నారు. ఆ పక్కనే ఇరిగేషన్ కార్యాలయం, పోలీస్ క్వార్టర్స్, ట్రాఫిక్ డిఎస్‌పి కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం ఉన్నా వారు పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ మద్యం తాగిన తర్వాత ఆ ఖాళీ సీసాలను, ప్లాస్టిక్ గ్లాసులను, తినుబండారాల కాగితాలను అక్కడ ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లోకి విసిరేస్తున్నారు. కొంతకాలం వరకూ ఈ పోలీస్ క్వార్టర్స్‌లో పోలీసుల కుటుంబాలు నివసించేవి. ప్రస్తుతం ఆ ప్రాంతం పోలీసుశాఖ భవనాల పునరుద్ధరణ పనులు చేసేందుకు పోలీసులు కుటుంబాలను క్వార్టర్స్ నుండి ఖాళీ చేయించింది. దీంతో అప్పటి నుండి అల్లరి మూకలు ఆ ప్రాంతానికి చేరుకుని మద్యం తాగడం మొదలుపెట్టారు. నిత్యం జిల్లా అధికారులు, పోలీసు అధికారులు సంచరించే ప్రాంతం కావడంతో ఎవరు ఈ ప్రాంతంపై నిఘా పెట్టలేదు. ఇకనైనా అధికారులు ఈ ప్రాంతంపై నిఘా పెట్టి ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



మందుబాబులు మద్యంతాగేది ఇక్కడే..

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వాహన చోదకులు వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ జగదీశ్వరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక అశోక్‌నగర్‌లో వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 25 వాహనాలకు జరిమానాలు విధించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎక్కువ మంది వాహనదారులు హెల్మెట్ ధరించక పోవడం వల్లే మృత్యువాత పడుతు న్నారన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మట్టిపెల్లలు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కొయ్యలగూడెం

ప్రమాదవశాత్తు మట్టిపెల్లలు మీద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుని బంధువుల కథనం మేరకు.. మండలంలోని అంకాలగూడెం గ్రామానికి చెందిన పలివెల రాంబాబు (30) వృత్తిరీత్యా కూలి పనులు చేస్తూ జీవించేవాడు. బుధవారం చెరువులో ఏడు అడుగుల లోతులో మట్టి తవ్వుతుండగా పైన ఉన్న మట్టిపెల్లలు విరిగి అతనిపై పడ్డాయి. తీవ్ర గాయాలపాలైన అతడిని అక్కడివారు కొయ్యలగూడెం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి- కొయ్యలగూడెం

అక్రమంగా ఇసు కను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రాజవరం ఎర్రకాలువలోని ఇసుకను అక్రమంగా బుధవారం రాత్రి తరలిస్తున్నట్లు విఆర్ఒకు సమాచారం వచ్చిందన్నారు. విఆర్ఒ రమేష్ ఆ ప్రాంతానికి చేరుకుని ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన అక్కడికి వెళ్లిన పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోరలు చాస్తున్న కాల్'నాగులు'..!

అధిక వడ్డీ వసూళ్లు - చిరువ్యాపారులు, జూదరాయుళ్లే లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు

అవతలి వారి అవసరాలే ఆదాయంగా.. ఎదుటి వారి బలహీనతలే బలంగా.. అమాయకులే వారి లక్ష్యంగా వడ్డీ బకాసురులు చెలరేగిపోతున్నారు. కొంతకాలం క్రితం రాష్ట్రాన్నే కుదిపేసిన కాల్‌మనీ ఉదంతంతో కాస్త వెనక్కి తగ్గిన వడ్డీ వ్యాపారులు తిరిగి ఇప్పుడు విజృంభిస్తున్నారు. అవతలివారి అవసరాలను గుర్తించి వారికి అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ జలగల్లా పట్టి పీడిస్తున్నారు.



కొంతకాలం క్రితం కాల్‌మనీ ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఆ సమయంలో నగరంలో కూడా కొందరు కాల్‌మనీ వ్యాపారులు బయటకొచ్చారు. ఆ తర్వాత కొంతకాలం వడ్డీ వ్యాపారుల ఆగడాలు సర్దుమనిగాయి. దీంతో దాదాపుగా వీరి ఆగడాలు ఆగిపోయాయని అందరూ అనుకున్నారు. కానీ మళ్లీ నగరంలో కాల్‌మనీ వ్యాపారుల ఆగడాలు మొదలయ్యాయి. అమాయకులను ఎంచుకుని వారి అవసరాలను తెలుసుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ వారి నుంచి వాటిని తిరిగి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు.

నగరంలో ఎక్కువగా ఎస్‌టిడి వడ్డీ వ్యాపారులు చిరు వ్యాపారస్తులను టార్గెట్ చేస్తున్నారు. చిరు వ్యాపారులకు రూ.వెయ్యి ఇస్తే దానికి గానూ రోజుకు రూ.50 చొప్పున వడ్డీని వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా వారినుంచి ప్రాంసరీ నోట్లను తీసుకుంటు న్నారు. వారు సకాలంలో వడ్డీ చెల్లించకపోతే వారి దుకాణాల వద్దకు వెళ్లి నానా హంగామా సృష్టిస్తుంటారు. దీంతో వారికి భయపడి వారు చెప్పిన మొత్తాన్ని చెల్లిస్తున్నా రు. చిరు వ్యాపారులకే కాకుండా పేకాట, కోడిపందేలు వంటి శిబిరాల వద్ద ఇటీవల కాలంలో ఈ తరహా వడ్డీ వ్యాపారస్తులు అధికమయ్యారు. జూద శిబిరాల వద్ద డబ్బు లు పోగొట్టుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని వారికి అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నారు. వారు తీసుకున్న డబ్బులు సకాలంలో ఇవ్వకపోతే ఇంటికి వెళ్లి మరీ వారిపై దాడులకు కూడా పాల్పడుతున్నారు. ఈ తరహా వడ్డీ వ్యాపారాలు ఎక్కువగా వంగాయగూడెం, తంగెళ్లమూడి, సాయినగర్, లక్ష్మమ్మ చెరువుగట్టు ప్రాంతాల్లో ఎక్కువగా సాగుతున్నాయి.

ఊరు వదిలి పారిపోయిన వైనం

చాలామంది వీరి ఆగడాలకు తాళలేక ఊర్లు వదిలి పారిపోయిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. లక్ష్మమ్మ చెరువుగట్టుపై కామేశ్వరరావు అనే యువకుడు ఓ వడ్డీ వ్యాపారి వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకుని దాన్ని చెల్లించలేక ఏకంగా తన కుటుంబంతో సహా ఊరు వదిలి పారిపోయాడు. అంతేకాకుండా సాయినగర్‌కు చెందిన మరో యువకుడు కూడా అలాగే ఊరు వదిలి పారిపోయాడు.

శాంతినగర్‌లో గొలుసుచోరీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సినీఫక్కీలో నడిచి వెళ్తున్న వద్దురాలి మెడలోని బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు అపహరించారు. ఏలూరు త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక శాంతినగర్ నాలుగో రోడ్డుకు చెందిన వడ్డే కామేశ్వరి స్థానిక 14వ రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాలలో చదువుతున్న తన మనవరాలిని తీసుకొచ్చేందుకు గానూ బుధవారం రాత్రి పాఠశాలకు వెళ్లింది. బాలికను తీసుకుని నడుచుకుని ఆమె వస్తుండగా అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించుకుని పరారయ్యారు. ఈ ఘటనలో గాయాలపాలైన ఆమెను అక్కడివారు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫిట్స్‌తో ఆటోడ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆటో నడుపుతున్న సమయంలో హఠాత్తుగా ఫిట్స్ రావడంతో ఓ ఆటోడ్రైవర్ మతి చెందిన సంఘటన ఇది.. పోలీసుల కథనం ప్రకారం.. పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన రాజారావు (36) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆటోపై ప్రయాణికులను ఎక్కించుకుని స్థానిక ఏలూరు ప్రభుత్వాసుపత్రి సమీపానికి వచ్చాడు. ఆ సమయంలో అతనికి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. దీంతో గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు

ముగ్గురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కేశవరం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు జూదరులను అరెస్టుచేశారు. వారినుంచి రూ.1,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు గణపవరం ఎస్ఐ దావు హరికృష్ణ తెలిపారు.

కొత్తపల్లిలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - లింగపాలెం

మండలంలోని కొత్తపల్లిలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. బాధితుడు పి.కొండయ్య కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లికి చెందిన కొండయ్య కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతను కుటుంబంలోని సభ్యులంతా గురువారం కూలిపనులకు వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంటికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో అగ్నికి ఆహుతైంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో పది బస్తాల ధాన్యం, రెండు సైకిళ్లు, ఓ కలర్ టివి అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక విఆర్ఒ ఖలీల్ వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. బాధితులు కట్టుబట్టలతో పాటు రోడ్డుపై పడ్డారు. ఎవరైనా దాతలు తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు సాయం చేయాలని వారు కోరుతున్నారు.



నిరాశ్రయులైన బాధితులు

ఆచరిస్తారా.. ఆడిస్తారా..!

(మొదటి పేజీ నుంచి)

ప్రత్యేక అవగాహనా సదస్సుల రూపంలోనూ కోడిపందేలు నిర్వహించరాదని చెబుతున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. హైకోర్టు ఆదేశాలు, స్థానిక అధికారుల హెచ్చరికలతో కొన్ని ప్రాంతాల్లో పందేల నిర్వహణ జరగకపోవచ్చు. అయితే నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని పందేలు నిర్వహిస్తే తామెలా అడ్డుకోగలమని మండలస్థాయి అధికార యంత్రాంగం ప్రశ్నిస్తోంది. ఇప్పటికే హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాలకొల్లులో, వెంపలో భీమవరం, ఉండి ఎంఎల్ఎలు అంజిబాబు, శివ పందేల నిర్వహణకు మద్దతుగా మాట్లాడటాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నేతలు పందేలకు దూరంగా ఉండాలని సిఎం చంద్రబాబు ఇప్పటికే తమ పార్టీ వారికి సూచించారు. అయితే అవి పైపై మాటలా.. లేక హైకోర్టు ఆదేశాలను గౌరవించి చేసిన సూచనా అనేది సంక్రాంతి సమయంలోనే తేలనుంది. ఎందుకంటే హైకోర్టు ఆదేశాల ప్రకారం పందేలను అడ్డుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే.. ఏదైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారనే పేరుతో సిఎం చంద్రబాబు, ఇతర ప్రముఖుల పర్యటన సందర్భంగా సిపిఎం, వామపక్షాలు, ప్రజాసంఘాల నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారు. మరి హైకోర్టు ఉత్తర్వులకు భిన్నంగా మాట్లాడుతూ, పందేల నిర్వాహకులకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులను గృహ నిర్బంధం చేస్తారా, లేక ముందస్తు అరెస్టు చేస్తారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ పందేలను ఎంఎల్ఎలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించేవారు. అయినా వారిపై ఎటువంటి చర్యలుండేవి కావు. ఈసారి పోలీసులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. ఆ సందర్భంగా అధికారపక్షం ఎలా స్పందిస్తుందనేది ప్రశ్నార్థకమే. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఉన్నతస్థాయి నుంచి కిందిస్థాయి వరకూ అధికార యంత్రాంగాన్ని చట్టానికి అనుగుణంగా పని చేయించడంతో పాటు పని చేసుకునే స్వేచ్ఛనిస్తే చాలా వరకూ పందేలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అలాకాకుండా పైపైన హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తున్నట్లుగా ప్రకటనలు.. లోలోన దానికి తూట్లు పొడుస్తూ చర్యలుంటే పందేలకు అడ్డుకట్ట పడే అవకాశం కష్టమని చెబుతున్నారు.

ఇక పందెంరాయుళ్లు కూడా హైకోర్టు చర్యలకు లోనుకాకుండా పందేలు ఎలా నిర్వహించాలనే దానిపై కసరత్తు ప్రారంభించారు. ఎప్పటిలా గతంలో నిర్వహించే బరుల్లో పందేలు నిర్వహించకూడదనే నిర్ణయానికొచ్చారు. ఇక డెల్టాలోనైతే పెద్ద విస్తీర్ణం గల చెరువుల వద్ద పందేలు నిర్వహిస్తే మంచిదని, అక్కడకు మీడియా, పోలీసులు రావడం కష్టమని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అయితే ఆ తరహాలో కార్లు వెళ్లే అవకాశాలున్న ప్రాంతాలను గుర్తించే పనిలో నిర్వాహకులు నిమగ్నమైనట్లు సమాచారం. ఇక మెట్ట ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా తోటల నడుమ పందేలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ పోలీసులు అక్కడికి చేరుకుంటే ముందుగానే సమాచారం అందేలా ఆయా ప్రాంతాలకు వెళ్లే దారిలో ప్రత్యేక వ్యక్తులను నియమించుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. తద్వారా ప్రముఖులు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆదే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకునే లోపు డింకీ పందేలుగా మార్పు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి పేకాట, గుండాట వంటివి దూరంగా ఉంచాలని, మద్యం మాత్రం తామే సరఫరా చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం పరిణామాలను గమనిస్తుంటే హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గుట్టుచప్పుడు కాకుండానైనా పందేలు నిర్వహించాలని పందెంరాయుళ్లు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మరి ప్రభుత్వం పందేలను ఎలా అడ్డుకుంటుందో సంక్రాంతి వరకూ వేచి చూడాలి.

మమ్మల్ని బలి పశువుల్ని చేస్తారా

పందేల నిర్వహణ అంతా రాష్ట్రస్థాయి నేతల కనుసన్నల్లో జరుగుతుంటాయని, వాటిని తామెలా అడ్డుకోగలమని కిందిస్థాయి రెవెన్యూ, పోలీసు సిబ్బంది లోలోన మదనపడుతున్నారు. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అనే రీతిలో తమ పరిస్థితి తయారైందని వాపోతున్నారు. సంక్రాంతికి పందేలు జరిగే సమయంలో జిల్లాస్థాయి అధికారులే పత్తా ఉండరని, వారి ఫోన్లు సైతం కలవడం కష్టమని, ఆ పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో తామెలా ముందుకు పోగలమని వారు ప్రశ్నిస్తున్నారు. గత సంవత్సరం తహశీల్దార్లకు, ఎస్‌హెచ్‌ఒలకు నోటీసులిచ్చారని, ఇప్పుడు తమపై చర్యలు తీసుకుంటామంటే ఆందోళనబాట పట్టక తప్పదని స్పష్టం చేస్తున్నారు. తమపని తమను చేసుకోనిస్తే ఏ సమస్యా ఉండదని, కానీ చూసీచూడనట్లు వదిలేయండని చివరి నిముషంలో ఎన్నోసార్లు మౌఖిక ఆదేశాలొచ్చాయని గుర్తు చేస్తున్నారు. అప్పటి వరకూ కఠినంగా వ్యవహరించిన తాము చివరి దశలో మిన్నకుండాల్సి రావడంతో ఇటు ప్రజాప్రతినిధులు, అటు నేతల్లోనూ చులకనైపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వమే విధాన నిర్ణయంగా పందేలు నిర్వహించరాదని ప్రకటించి ప్రజాప్రతినిధులను, నేతలను కట్టడి చేస్తే కిందిస్థాయిలో తమ పని సులువవుతుందని చెబుతున్నారు.

ఆదిలోనే హంసపాదు..!

(మొదటిపేజీ నుంచి)

కిందికి వదులుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా తమకు కేటాయించిన మూడు రోజుల వంతు సమయంలోనూ నీరందకపోవడం చాలా కష్టతరంగా ఉందని కింది గ్రామాలైన వీరవాసరం శివారు ప్రాంతం, మెంటేపూడి, వడ్డిగూడెం, బొబ్బనపల్లి, మత్స్యపురి ఆయకట్టు రైతులు అంటున్నారు.

మాకు అన్యాయం జరుగుతుంది

బళ్ల పెన్నయ్య, కౌలురైతు, మత్స్యపురి



పేరుకే వంతు కేటాయిస్తున్నారు. మాకు కేటాయించిన సాగునీరు మాకు పూర్తిగా అందాలి. కాలువ ఎగువభాగంలో డ్యాముల పరిధిలో అమలు చేస్తున్న 24 గంటల వంతు విధానాన్ని సవరించాలి. వారంలో నాలుగు రోజులు కాలువ ఎగువ భాగంలోని ఆయకట్టుకు నీరందిస్తే మాకు కేటాయించిన మూడు రోజుల వంతులో కూడా మాకు అన్యాయం జరుగుతుంది. తక్షణమే అధికారులు స్పదించి మా సాగునీటి కష్టాలను తప్పించాలి.

కోమట్లపాలేనికి తాగునీరివ్వరా..!

(మొదటి పేజీ నుంచి)

అన్నారు. చెరువుల యజమానులు కలుషిత నీటిని పంట కాల్వలోకి వదలటం ద్వారా అదే నీరు మంచినీటి చెరువులోకి చేరి తాము రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పొలాలను ఆనుకుని చెరువులు తవ్వడం వల్ల పంట పొలాల దిగుబడి తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చెరువుల యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని, తమకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్పందించిన ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు గ్రామంలోని చెరువులను పరిశీలించారు. పంట కాల్వ, దాన్ని ఆనుకుని ఉన్న చెరువుల్లోని నీరు కాల్వలోకి ఎలా కలుస్తుందనేది పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామసభలో మాట్లాడుతూ సమస్య ఉన్న మాట వాస్తవమేనన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చెరువుల యజమానులతో మాట్లాడి మురుగునీటికి వేరుగా తూరలు నిర్మించుకునేటట్లు చర్యలు చేపడతానని, పంట కాల్వలోకి కలుషిత నీరు కలవకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కోడి గుడ్ల ధరలు



విజయవాడ	రూ. 3.85
హైదరాబాద్	రూ. 3.90
ప.గోదావరి	రూ. 3.85
తూ.గోదావరి	రూ. 3.85
విశాఖ	రూ. 3.90
చిత్తూరు	రూ 3.88
చెన్నై	రూ. 3.95
నామకల్	రూ 3.95



బులియన్ మార్కెట్

24 క్యారెట్లు : 3,007(గ్రాము) : 30,070 (10గ్రా)

22 క్యారెట్లు : 2,819 (గ్రాము) : 28,190 (10గ్రా)

వెండి : 39.00(గ్రాము) : 39,000 (కిలో)

రైల్వే టైమ్‌టేబుల్

ఏలూరు నుంచి

రైలు నెం.	రైలు పేరు	వచ్చు సమయం	వెళ్లుసమయం
	రాజమండ్రి వైపు		
12728	గోదావరి-హైదరాబాద్-విశాఖ	00.06	00.07
12740	గరీబ్‌రథ్-సికింద్రాబాద్-విశాఖ	02.41	02.42
18048	అమరావతి:వాస్కోడిగామా-హౌరా(సో,బు,శు,శ)	03.46	03.47
12738	గౌతమి-సికింద్రాబాద్-కాకినాడ పోర్ట్	04.06	04.07
17487	తిరుమల-తిరుపతి-విశాఖ	04.21	04.22
18510	ఎక్స్‌ప్రెస్-హెచ్-ఎస్ నాందేడ్-విశాఖ (సో,గు,శు)	04.41	04.42
18310	నాగావళి-నాందేడ్-సంబల్‌పూర్ (మ, బు, ఆది)	04.41	04.42
67300	ప్యాసింజర్-విజయవాడ-రాజమండ్రి	05.48	05.50
12718	రత్నాచల్-విజయవాడ-విశాఖ	06.51	06.52
12840	మెయిల్ -చెన్నయ్-హౌరా	07.26	07.27
18464	ప్రశాంతి-బెంగులూర్-భువనేశ్వర్	07.41	07.42
12862	లింక్-నిజాముద్దీన్-విశాఖ	07.51	07.52
13352	బొకారో-అలెప్పి-టాటానగర్	08.16	08.17
57225	ప్యాసింజర్-విజయవాడ-విశాఖ	09.47	09.48
12864	యశ్వంత్‌పూర్- యశ్వంత్‌పూర్-హౌరా	10.26	10.27
17239	సింహాద్రి-గుంటూరు-విశాఖ	10.34	10.35
22416	ఎపి ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ-విశాఖ	13.31	13.32
57257	ప్యాసింజర్-తిరుపతి-కాకినాడ	13.59	14.00
12806	జన్మభూమి-సికింద్రాబాద్-విశాఖ	14.27	14.28
11019	కోణార్క్-ముంబై-భువనేశ్వర్	15.08	15.09
17205	షిర్డీ- సాయినగర్ షిర్డీ-కాకినాడ టౌన్ (సో,బు,శు)	16.25	16.27
18646	ఈస్ట్‌కోస్ట్-హైదరాబాద్-హౌరా	17.38	17.39
57231	ప్యాసింజర్-విజయవాడ-కాకినాడ పోర్ట్	18.33	18.35
67261	ప్యాసింజర్-విజవాడ-రాజమండ్రి	19.46	19.47
57271	ప్యాసింజర్-విజయవాడ-రాయగడ	22.16	22.17
12704	ఫలక్‌నామా-సికింద్రాబాద్-హౌరా	22.26	22.27
	విజయవాడ వైపు		
12739	గరీబ్‌రథ్-విశాఖ-సికింద్రాబాద్	00.44	00.45
12703	ఫలక్‌నామా-హౌరా-సికింద్రాబాద్	01.39	01.40
11020	కోణార్క్-భువనేశ్వర్-ముంబై	03.06	03.07
22883	పూరీ-పూరీ-యశ్వంత్‌పూర్(శని)	03,34	03.35
67262	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	05.40	05.41
57272	ప్యాసింజర్-రాయగడ-విజయవాడ	07.04	07.05
57232	ప్యాసింజర్-కాకినాడపోర్ట్-విజయవాడ	08.00	08.01
17206	షిర్డీ ఎక్స్‌ప్రెస్-కాకినాడ-షిర్డీ (సో,బు,శని)	08.31	08.32
18645	ఈస్ట్‌కోస్ట్-హౌరా-హైదరాబాద్	09.25	09.26
12805	జన్మభూమి-విశాఖ-సికింద్రాబాద్	10.28	10.29
57258	ప్యాసింజర్-కాకినాడ-తిరుపతి	11.31	11.32
17240	సింహాద్రి-విశాఖ-గుంటూరు	12.08	12.09
22415	ఎక్స్‌ప్రెస్-విశాఖ - న్యూఢిల్లీ	12.26	12.27
13351	బొకారో-టాటానగర్-అలెప్ప్రి	14.36	14.37
12863	హౌరా-హౌరా-యశ్వంత్‌పూర్	15.02	15.03
57226	ప్యాసింజర్-విశాఖప్నటం-విజయవాడ	15.50	15.52
12717	రత్నాచల్-విశాఖ-విజయవాడ	16.51	16.52
18047	అమరావతి-హౌరా-వాస్కోడిగామా(మ,బు,శు,ఆది)	16.58	16.59
18463	ప్రశాంతి-భువనేశ్వర్-బెంగుళూర్	17.31	17.32
17488	తిరుమల-విశాఖ-తిరుపతి	18.41	18.42
12861	లింక్-విశాఖ-నిజాముద్దీన్	19.33	19.34
67229	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	19.45	19.50
12727	గోదావరి-విశాఖ-హైదరాబాద్	22.01	22.02
12737	గౌతమి-కాకినాడపోర్ట్-సికింద్రాబాద్	22.56	22.57
18309	సంబల్‌పూర్-నాందేడ్(సో,మ,ఆది)	23.47	23.48
18509	ఎక్స్‌ప్రెస్-విశాఖ-నాందేడ్(మ,బు,శని)	23.47	23.48

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో ఆ ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన కంభపు శ్రీను (38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి లక్కవరంలో ట్రాక్టర్‌తో పొలంలో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ఆ ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయిన శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు కంభపు శ్రీనుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



బోల్తాకొట్టిన ట్రాక్టర్



వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నేతలు

జిఒ 151 జీతాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికులకు జిఒ నెంబర్151 ప్రకారం ప్రభుత్వం పెంచిన జీతాలను అమలు చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారు పెద్దిరాజు, బంగారు దుర్గాప్రసాద్, దానాల లక్ష్మి, బంగారు వరలక్ష్మి, ముత్యాల సాయమ్మ, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతదేహం అలజడి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక దొరగారి చెరువుగట్టున ఉన్న శ్మశానవాటికలో పాతిపెట్టిన మృతదేహం పైకి రావడంతో స్థానికులలో అలజడి నెలకొన్న ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతదేహాన్ని ఎవరో సగం పాతిపెట్టి వెళ్లారంటూ ప్రచారం సాగింది. దీంతో పలువురు ఆ ప్రాంతానికి వచ్చారు. ఈ మేరకు సిపిఎం పట్టణ కార్యదర్శి గేదెల అప్పారావు ఆ పార్టీ పంచాయతీ బోర్డు సభ్యురాలు దొడ్డిపద్మ సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలన జరిపారు. నాలుగు రోజుల క్రితం రైలు ప్రమాదంలో మృతి చెందిన అనాధను రైల్వే పోలీసులు స్థానిక శ్మశానవాటికలో ఖననం చేశారని, వారు మృతదేహాన్ని పూర్తి స్థాయిలో పాతిపెట్టకపోవడంతో గ్రామంలో అలజడి రేగినట్టు వారు వివరించారు.

ఐదో కాంటూరు కట్టడాలపై అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఆకివీడు

వన్యప్రాణి సంరక్షణ విభాగం తనిఖీ అధికారి గురువారం ఆకివీడులో పర్యటించారు. స్థానిక సిద్ధాపురంలోని రోడ్డులో ఐస్ ఫ్యాక్టరీని గుడౌన్‌ను ఐదో కాంటూరు ప్రాంతంలో నిర్మిస్తున్నట్లు జిల్లా అటవీ అధికారికి ఫిర్యాదు అందినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో జిల్లా అధికారి సాయిబాబా ఆదేశాలతో మొబైల్ స్క్వాడ్ రేంజర్‌గా పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు విచారణ నివేదికను జిల్లా అధికారికి పంపించనున్నట్లు వెల్లడించారు.

సాగు భూమిలో డంపింగ్‌యార్డు..!

గ్రామంలో 280 ఎకరాల పోరంబోకు భూమి

పేద రైతు భూమి లాక్కోవడం దారుణం

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడలో డంపింగ్ యార్డు నిర్మాణానికి సుమారు పదేళ్ల నుంచి సాగు చేసుకుంటున్న నిరుపేద, హరిజన కుటుంబం భూమిని ఎంపిక చేశారు. దీంతో ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన చందంగా డంపింగ్ యార్డు నిర్మాణం మారింది. గ్రామంలో సుమారుగా 280 ఎకరాల పోరంబోకు భూములు ఉన్నట్లుగా అధికారుల నివేదికలు చెబుతున్నాయి. వీటిపై దృష్టి సారించాల్సిన అధికార యంత్రాంగం నిరుపేద కుటుంబంపై తన పంజా విసరడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూస్వాముల అక్రమాలపై కన్నెత్తి చూడని అధికారులు, ప్రజా ప్రతినిధులు బడుగు బలహీన వర్గాలపై ఉక్కుపాదం మోపడం దారుణమని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని సంగవాలు కోడాను ఆనుకుని ఉన్న అరెకరం భూమిలో ఆకుల రాజారావు అతి కష్టం మీద సాగులోకి తీసుకొచ్చారు. రెవెన్యూశాఖకు పన్నులను చెల్లిస్తున్నారు. ఆయనకు కుమార్తె, నలుగురు కుమారులు ఉన్నారు. ఇటీవల కాలంలో రాజారావు భూమిని డంపింగ్‌యార్డు నిమిత్తం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో నిరుపేద కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ స్థానిక దళితులు, దళిత యువకులు తహశీల్దార్‌తో రాయబారం జరిపారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ప్రత్యామ్నాయంగా పోరంబోకు భూమి ఉంటే చూపించాలని దళితులను అడగడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. గ్రామంలో 280 ఎకరాల పోరంబోకు భూమి ఉన్నట్లు అధికార లెక్కలే చెబుతున్నాయని, వాటిపై దృష్టి సారించకుండా అధికారులు దళితుల భూమిని లాక్కోవడానికి ప్రయత్నించడం దారుణమని గ్రామంలోని దళిత సంఘాలు, వామపక్ష పార్టీలు ఖండిస్తున్నాయి. డంపింగ్ యార్డు నిర్మాణానికి నిరుపయోగంగా ఉన్న పోరంబోకు భూమిని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పొలాన్ని చూపుతున్న రైతు

ప్రతి ఎకరాకూ సాగునీరందించాల్సిందే



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - పాలకోడేరు

వరినాట్లు పూర్తయ్యే వరకూ వంతుల వారీ విధానంతో సంబంధం లేకుండా ప్రతి ఎకరాకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సిపిఎం 26వ రాష్ట్ర మహాసభలు సందర్భంగా సాగునీరు - తాగునీరు అనే అంశంపై స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి చేబోలు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భగా వినియోగదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేళం దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు కలుషితమవ్వడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ గర్భజలాలను పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ అక్రమ చెరువుల తవ్వకాలను అరికట్టడంలో అధికారులు నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పంట భూములను ఆక్వా చెరువులుగా మార్చడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పంట బోదెలు, తాగునీటి చెరువులు ఉన్న చోట్ల తవ్విన ఆక్వా చెరువుల లైసెన్సులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కారుమంచి క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ పాల్గొన్నారు.

డిఎన్‌ఆర్‌లో గురుకుల విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.రెండు కోట్లతో ఏర్పాటు చేసిన సిమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల్లో ఎంపిక చేసిన 8, 9, ఇంటర్మీడియట్ చదువుతున్న 73 మంది విద్యార్థులకు వారం రోజుల పాటు వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ యు.రంగరాజు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ హోమ్, ఎలక్ట్రానిక్స్ ఆఫీస్, ఎలక్ట్రికల్ హోమ్, కాంప్యూటర్ బెస్ట్ ట్రైనింగ్ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇంజినీరింగ్ కళాశాలలో సంప్రదించాల్సిందిగా ఆ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు చెప్పారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వం తలపెడుతున్న అభివృద్ధి పనులకు ప్రతిఒక్కరూ సహకరించాలని భీమవరం ఎంఎల్ఏ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని గురువారం రాయకుదురు, చింతలకోటిగరువు, వీరవల్లిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎంఎల్ఏ అంజిబాబు మాట్లాడుతూ వేలిముద్రలు, ఐరిస్‌లు పడకపోయినా లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులు ఇవ్వాల్సిందిగా అధికారులను, రేషన్‌డీలర్లను ఆదేశించారు. రాయకుదురులో తాగునీటి చెరువును అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రూ.1.28 కోట్లతో ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం చింతలకోటిగరువులో రూ.ఏడు లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎంఎల్ఏ అంజిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పంజా వెంకన్న, విప్పర్తి సౌధామణి, కడలి ఈశ్వరి, టిడిపి మండల అధ్యక్షుడు పోలిశెట్టి సత్యనారాయణ, పాలా వెంకటేశ్వరరావు, ఎంపిటిసి కొమ్మన వెంకట ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.



సదరం సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎంఎల్ఏ శివ

ఉండి : మండలంలోని ఉప్పులూరు, పాందువ్వ గ్రామాల్లో గురువారం జన్మభూమి మాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. ఉప్పులూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామ సర్పంచి యర్రా ప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ఎంఎల్ఏ వేటుకూరి వెంకట శివరామరాజు మాట్లాడుతూ పెన్షన్ రాని వికలాంగులకు సదరం సర్టిఫికెట్ ద్వారా పెన్షన్‌లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్సి మంతెన సత్యనారాయణరాజు (పాందువ శ్రీను), ఎఎంసి వైస్ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసు, ఎంపిపి దాలియ లక్ష్మి, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపిడిఒ రెడ్డియ్య, జెడ్‌పిటిసి సభ్యులు కె.వెంకట సత్యతులసి పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ వేటుకూరి శివరామరాజు అన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమం మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో ఆ గ్రామ సర్పంచి దేగల రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శివ మాట్లాడుతూ గ్రామంలో మంచినీరు, రోడ్ల సమస్యలున్నాయని వాటిని తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు.

ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో మెలగాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతిఒక్కరూ ఆత్మగౌరవంతో మెలగాలని స్థానిక ఎంఎల్ఏ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆత్మగౌరవ దీక్షలో భాగంగా మైప గ్రామంలో చెంబు, బాటిళ్లకు శవ యాత్ర చేపట్టారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చెంబు, బాటిళ్లతో కూడిన పాడిని మోస్తూ వినూత్న రీతిలో ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్వశిక్షాభియాన్ డైరెక్టర్ శ్రీనివాసు, శివరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శివ మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం వినూత్న రీతిలో కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను విధిగా వినియోగించాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆత్మగౌరవానికి పరిరక్షణ కలుగుతుందన్నారు. శ్రీనివాసు మాట్లాడుతూ రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా అన్ని రంగాల్లో ముందుందన్నారు. ప్రథమ ఒడిఎఫ్ జిల్లాగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం చెంబు, బాటిళ్లను ఖననం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరత్నం, ఇఒపిఆర్‌డి విల్సన్‌రాజు, మండల శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-భీమవరం రూరల్

సావిత్రిబాయి ఫూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు కారుమంచి క్రాంతిబాబు డిమాండ్ చేశారు. గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వింతతు పునర్వివాహాలు జరిపించడంలో కీలకపాత్ర పోషించి మహిళా హక్కులకై 150 ఏళ్ల క్రితమే పోరాడిన ధైర్యశాలి సావిత్రిబాయి ఫూలే అని కొనియాడారు. స్త్రీ విద్యను నిషేధించిన రోజుల్లో, స్త్రీలకు విద్యను నేర్పించేందుకు పాఠశాలను ప్రారంభించారన్నారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిఫూలే అన్నారు. ఆధిపత్య కులాల పెద్దలు, మత, ఛాందసవాదులు ఆమెపై దాడులు చేసినప్పటికీ వెనుకడుగు వేయలేదన్నారు. అయితే నేటికీ స్త్రీకి విముక్తి, రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ కన్వీనర్ జంగం మాణిక్యాలరావు, అంబేద్కర్ యువత పట్టణ నాయకులు గుంటి జీవరత్నం, గుంటి కాంతారావు, పద్మారావు, నాని, కుమార్‌రాజు, సంపత్, నారాయణ పాల్గొన్నారు.

గొరగనమూడిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొరగనమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా సంబరాలు చేపట్టారు. దీనిలో భాగంగా విద్యార్థులు పాఠశాల ఆవరణంలో వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేంద్ర వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు మన్నే మహంకాళి వర ప్రసాద్ రంగవల్లులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు జంట తెలుగు రాష్ట్రాలు నిలయాలన్నారు. సంక్రాంతి వచ్చిందంటే బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అంతా ఒకచోట కలుసుకుని అప్యాయతగా పలకరించుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉంగరాల నాగేశ్వరరావు, ఐకెపి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రంగవల్లులను పరిశీలిస్తున్న లక్ష్మి

ప్రజాశక్తి
పశ్చిమ గోదావరి
శుక్రవారం 5 జనవరి 2018

ఎవరి దారి వారిదే

కోడిపందేల నివారణపై దృష్టి సారించిన పోలీసులు - పందేలకు సిద్ధమవుతున్న జూదరాయుళ్లు

హైకోర్టు ఆదేశాలతో అంతటా ఉత్కంఠ - అందరి చూపూ పందేలపైనే



ఉండ్రాజవరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - తణుకు రూరల్, ఉండ్రాజవరం

సంక్రాంతి అంటే తాజాగా చర్చకొస్తుంది.. కోడిపందేలు. హైకోర్టు ఆదేశాలతో పందేలరాయుళ్లు ఆశ నిరాశల నడుమ ఊగిసలాడుతున్నారు. పందెంరాయుళ్లు మాటెలాగున్నా అధికారులు మాత్రం పందేలకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. వీటిపై ప్రజలు బాగుందని స్పందిస్తున్నా నిర్వాహకుల్లో ఏమేర మార్పు వస్తుందనేది సంక్రాంతి వరకూ చెప్పలేమని పెద్దలు చెబుతున్నారు. పందేలు నిర్వహిస్తే యువత పక్కదారి పడుతోందని, పందేలతోపాటు పక్కనే సాగే పేకాట, గుండాటలో సొమ్ములు పోగొట్టుకోవడంతోపాటు మద్యం మత్తులో ఊగుతున్నారని వాపోతున్నారు. ఏదేమైనా పందేలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని పోలీసులను కోరుతున్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది మాత్రం షరా మాములుగా పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అంతటితో ఆగకుండా పందేలు నిర్వహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బరులు లేకుండా అక్కడున్న ఫెన్సింగ్ వంటి వాటిని తొలగిస్తున్నారు. ఆయా స్థలాల యజమానులు పిలిచి హెచ్చరిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఈ ఏడాది పందెంరాయుళ్లకంటే ముందుగానే పోలీసులు బరుల వద్దకు చేరుకున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. మరి సంక్రాంతి ముగిసే వరకూ వీరు బరుల్లోనే ఉండి పందేలకు అడ్డుకట్ట వేస్తారా లేక పండుగ ప్రారంభం రోజున అక్కడ నుంచి వెనుదిరిగి పందేల నిర్వహణకు అవకాశం కల్పిస్తారా అనే దానిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి.



పందేల నిర్వహణ చట్టవిరుద్ధం
డి.ఆదినారాయణ, తణుకు టౌన్ ఎస్ఐ



సంక్రాంతి పేరుతో కోడిపందేలు, జూదం వంటివి నిర్వహించడం చట్టవిరుద్ధం. వాటి వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రజల జీవితాలను నాశనం చేసే జూదాలు, కోడి పందేలను బహిష్కరిద్దాం. బొమ్మల కొలువు, ముగ్గుల పోటీ వంటి ఆటపాటలతో సందడి చేసుకోవాలి. పందేల నిర్వహణ సమాచారం ప్రజలకు మాకు అందించి సహకరించాలి.


ఉండ్రాజవరంలో ఆటోలో ప్రచారం..

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు
ఉండ్రాజవరం ఎస్ఐ కె.గంగాధరరావు

సంక్రాంతి ముసుగులో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మండలంలో అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారం చేపట్టాం. గ్రామాల కూడళ్లలో నిషేధాజ్ఞలు తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాం. ఆయా గ్రామాల్లో ముందుగా గుర్తించిన కోడిపందేల బరుల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి హెచ్చరించాం.

స్థల యజమానులారా.. పారాహుషార్

ప్రజాశక్తి - నరసాపురం

సంక్రాంతి పేరు చెప్పి గుండాట, పేకాట, కోతాట వంటి ఆటలాడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఎస్ఐ జి.సూర్యనారాయణరెడ్డి, పట్టణ ఎస్ఐ కె.చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలో కోడిపందేలు నిర్వహించే స్థలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించే స్థల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరూ డబ్బుకు ఆశపడి స్థలాలను ఇవ్వొద్దని, ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్, తహశీల్దార్ సూర్యనారాయణరెడ్డి

బరులపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే సహించేది లేదని తహశీల్దారు అప్పారావు అన్నారు. మండలంలో నారాయణపురం, ఉంగుటూరు, వెల్లమిల్లి, రాచూరు, గొల్లగూడెంలో గతేడాది కోడిపందేలు నిర్వహించిన ప్రాంతాలను చేబ్రోలు ఎస్ఐ తాటి వెంకటనాగరాజుతో కలసి గురువారం పరిశీలించారు. నారాయణపురంలో పందేల నిర్వహణకు బరి ఏర్పాటు చేసి గతేడాది వేసిన కంచెను ఇంకా తొలగించకుండా ఉంచడాన్ని గుర్తించారు. వెంటనే దాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని విఆర్ఒ పుల్లయ్యను ఆదేశించారు. అలాగే ఎక్కడా పందేలకు బరులను తయారు చేయకుండా విఆర్ఒలు, పోలీసులే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పందేల నిర్వాహకులను బైండోవర్ చేయాలని ఆదేశించారు.


నారాయణపురంలో కోడి పందేలు గతంలో జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు, పోలీసులు

సంప్రదాయ పోటీల నిర్వహణకు ఖాకీల కసరత్తు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పాఠశాల స్థాయి నుండే సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తు తరాలు సంప్రదాయాలను అనుసరిస్తాయని వన్‌టౌన్ సిఐ నాగమురళి పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోడిపందేలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతోపాటు పట్టణ పోలీసులే సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. దీనిలో భాగంగా స్థానిక కోట ప్రాంతంలోని కస్తూర్బా మునిసిపల్ బాలికోన్నతపాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో ఖోఖో, కబడ్డీ, ముగ్గులు, షటిల్ వంటి ఆటలను నిర్వహిస్తారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు కూడా అందిస్తున్నామని ఏలూరు వన్‌టౌన్ సిఐ నాగమురళి తెలిపారు.


ఆటల పోటీల ఫ్లెక్సీని ఆవిష్కరించిన పోలీసులు

కోడిపందేలు, జూదాలను అరికట్టండి : ఐద్వా

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్రాంతి సందర్భంగా యువత పక్కదారి పట్టకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, నాయకురాలు దొడ్డి పద్మ డిమాండ్ చేశారు. స్థానిక ఐద్వా మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు కోడిపందేలు, జూదాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వమే కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. యువత కోసం పండుగ మూడు రోజులు ప్రభుత్వమే ఆటల పోటీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.


ధర్నా నిర్వహిస్తున్న మహిళలు (ఫైల్ ఫోటో)

కొత్తపేట మహిళల విజయబావుటా

మద్యం దుకాణాన్ని తొలగించిన అధికారులు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండల పరిధిలోని పెన్నాడ కొత్తపేటలో నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎట్టకేలకు అధికారులు తొలగించారు. నివాస ప్రాంతాల మధ్య దుకాణాన్ని తొలగించాలని స్థానిక మహిళలు, గ్రామస్తులు అనేకమార్లు ఆందోళన చేశారు. అయితే అటు ప్రజాప్రతినిధులుగాని.. ఇటు అధికారులుగాని ఎవరూ పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో కొత్తపేట మహిళలకు అండగా ఐద్వా నిలిచింది. మహిళలను సమీకరించి ఐద్వా ఆధ్వర్యంలో అనేకసార్లు ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేసింది. దీంతో అధికారులు కదలక తప్పలేదు. మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. తాజాగా మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి పూర్తిగా తొలగించారు. దీంతో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి కొత్తపేటలో పర్యటించారు. మహిళలతో కలిసి మద్యం దుకాణం పూర్తిగా తొలగించారో లేదోనని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ గత వారం రోజులుగా మద్యం మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆందోళన చేశామని, దీని ఫలితంగా దుకాణాన్ని మూయించగలిగామని అన్నారు. ఇది మహిళలు సాధించిన విజయమన్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వం చూడటం దారుణమన్నారు. మద్యం వల్ల మహిళలకు రక్షణ లేదని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, యువత చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యాన్ని నియంత్రించాల్సింది పోయి మరింతగా తాగండి అంటూ అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచేందుకు అనుమతులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో శేషపు నాగలక్ష్మి, వేంద్ర నాగలక్ష్మి, గోవిందరమణ, బొడ్డు లక్ష్మి, గుబ్బల దుర్గ, తానేటి జయమ్మ, కుమారి, ముత్యాలు, గొల్లమ్మ, లక్ష్మి, రవణమ్మ, వరాలమ్మ పాల్గొన్నారు.

చాకిరీ ఎక్కువ.. ఆదాయం తక్కువ

కులవృత్తికన్నా కూలిపని నయమంటున్న మేదరులు - అర్ధాకలితో 200 కుటుంబాలు

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

మారుతున్న కాలంతోపాటు ముంచుకొస్తున్న ప్లాస్టిక్ భూతం ముందు మనుగడ సాగించలేక కుదేలవుతున్న వృత్తుల్లో మేదర వృత్తి ఒకటి. ఒకప్పుడు ఇంట్లో ఎటువంటి కార్యక్రమం జరిగినా అన్నం వార్చడానికి గంపల కోసం మేదర్ల వద్దకు వెళ్లాల్సిందే. కర్మకాండల్లో చేటలు, కూరగాయల అమ్మకానికి బుట్టల కోసం. తక్కెడ కోసం వెదురు మూతల నిమిత్తం, ఇలా ఒకటేమిటీ పలు అవసరాల కోసం మేదర్ల దగ్గరకు జనం క్యూ కట్టేవారు.

ప్రస్తుతం కాలం మారింది. అభివృద్ధి మాటున ప్లాస్టిక్ భూతం పడగవిప్పింది. ఫలితంగా వెదురు సామగ్రి స్థానంలో ప్లాస్టిక్ వస్తువులు రంగప్రవేశం చేశాయి. ఒకప్పుడు ఈత గంపల్లో లారీ ట్యూబు ముక్క పెట్టుకుని ఇంటింటికీ తిరిగి చేపలు, రొయ్యలు అమ్మేవారు ఇప్పుడు ప్లాస్టిక్ తొట్టెలు నెత్తిన పెట్టుకుని వస్తున్నారు. అన్నం వార్చేందుకు రంధ్రాలున్న ఓ అల్యూమినియం గిన్నెను మిగిలిన గిన్నెలతోపాటు షామియానా దుకాణదారు పంపించేస్తున్నాడు. విసనకర్ర స్థానంలో ప్లాస్టిక్ విసెనకర్రలొచ్చాయి. కనీసం కోళ్లు పెంచేవారైనా గతంలో గంపలు వాడేవారు. ప్రస్తుతం వారు కూడా ఇనుప ఊసలతో చేయించిన గంపల తరహా వస్తువును వాడుతున్నారు. మెంతులు, కాగితాలు నానబెట్టి మెత్తగా రుబ్బి ఆ గుజ్జుతో కొత్త చేటను అలికి ఆ చేటలో బియ్యంఏరుతూ మధ్యమధ్యలో నాలుగు గింజలను నోట్ల వేసుకునే దృశ్యాలు ఎప్పుడో కనుమరుగైపోయాయి.

ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ కులవృత్తిని వదల్లేక, మరే వృత్తి చేయలేక చాలీచాలని ఆదాయంతో కాలం గడుపుతున్నారు మేదరులు. పవర్‌పేట, పాతబస్టాండు వద్ద సుమారు రెండొందల కుటుంబాలు నేటికీ ఇదే వృత్తిలో కొనసాగుతున్నాయి. నాలుగు మూలల బుట్టలు, అన్నం గంపలు, కోళ్ల గంపలు, కుదుర్లు, విసెన కర్రలు, చేటలు, కూరగాయల జంగిడీలతోపాటు పెళ్లిళ్లలో తాంబూలాలు, పసుపు కుంకుమ పట్టుకెళ్లడానికి ఉపయోగించే బుట్ట బాక్సులను ఎంతో అందంగా తయారు చేసే మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ మనకు కన్పిస్తారు. అందమైన సామగ్రిని వెదురుతో తీర్చిదిద్దే వీరి జీవితాల్లోకి తొంగిచూస్తూ గూడుకట్టుకున్న విషాదం స్పష్టంగా కన్పిస్తోంది. 20 సంవత్సరాల వయస్సున్న మహిళల నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుల వరకూ నిత్యం ఇక్కడ బుట్టలు అల్లుతూ కన్పిస్తారు. శరీరంపై వృద్ధాప్య ఛాయలు కన్పిస్తున్నా, ఏమాత్రం కండలేక నరాలు పైకి తేలి కన్పిస్తున్న చేతులతో అలవోకగా బుట్టలు అల్లడం వీరి ప్రత్యేకత. ఎందుకమ్మా ఈ వయస్సులో ఇంత కష్టం అని ఎవరైనా అడిగితే మందు బిల్లల ఖర్చు కోసమైనా పని చేయాలిగా అంటూ సమాధానమిస్తారు ఆ వృద్ధులు.



జంగారెడ్డిగూడెం అటవీశాఖ డిపో నుంచి వెదురుగెడలు తెచ్చుకోవడం నుంచి మొదలవుతుంది వీరి పని. గతంలో ఒకొక్కరికి 500 గెడలు ఇచ్చే అధికారులు నేడు సంవత్సరానికి వంద నుంచి 150 గెడలకు మించి ఇవ్వడం లేదు. అందులో కొన్ని గెడలు పుచ్చుపట్టి మరికొన్ని బులుగుపోయి ఉంటున్నాయని, ఒక్కో గెడ ఏలూరు చేరేటప్పటికి రూ.60కుపైగానే ఖర్చవుతుందని చెబుతున్నారు. ఆ గెడలను ఎండబెట్టి కత్తితో చీల్చి బుట్టలు అల్లేసరికి ఒక్కో గెడ రెండు బుట్టలకు మించి రావడం లేదని, అవి అమ్మితే రూ.200 లోపు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి వెదురును చీల్చడం, అల్లడంతో చేతులు కాయలు కాచిపోయాయి తప్ప వెనకేసుకున్నదేమీ లేదని వాపోతున్నారు.

పెట్టుబడి కోసం రుణాలకు దరఖాస్తు చేస్తే నాలుగు సంవత్సరాల తర్వాత కొంతమందికి వచ్చాయని తెలిపారు. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నామని చెబుతున్నారు. ఇంత కష్టం, ఇబ్బందులు పడినా ఒక్కో రోజు కనీసం అమ్మకం కూడా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా కష్టపడితే ఒకొక్కరికి రూ.150కు మించి రావడం కష్టంగా ఉందని, పెరుగుతున్న ధరలకు తోడు ముంచుకొస్తున్న రోగాలతో మందులు కూడా కొనలేకపోతున్నామని అంటున్నారు. మార్కెట్లోకి ఇబ్బడిముబ్బడిగా వస్తున్న ప్లాస్టిక్ వస్తువులు తమ వృత్తిని నాశనం చేశాయని చెబుతున్నారు. తమ వృత్తిని రక్షించడం అంటే పర్యావరణాన్ని పరిరక్షించడమేనని, దీనికి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలి
రొట్టా సింహాచలం

గత 45 సంవత్సరాలుగా ఇదే వృత్తి చేసుకుని బతుకుతున్నాను. మార్కెట్లోకి ప్లాస్టిక్ వస్తువులు రావడంతో మా వృత్తి దయనీయ స్థితిలో ఉంది. రోజంతా కష్టపడినా రూ.150 రావడం కష్టమైపోతుంది. ప్రభుత్వాలు ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తే కొంతైనా మాకు మేలు జరుగుతుంది.



అందరికీ రుణాలివ్వాలి
గ్రంధి కుమారి

30 సంవత్సరాల నుంచి ఇదే వృత్తిలో పని చేస్తున్నాను. ప్రయివేటు అప్పులతో వడ్డీలు కట్టలేకపోతున్నాం. రుణాల కోసం దరఖాస్తు చేస్తే కొందరికే ఇచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ కష్టించినా రూ.వంద కూడా ఒక్కో రోజు రావడం లేదు. ప్రభుత్వం అందరికీ రుణాలిచ్చి ఆదుకోవాలి. మా పిల్లలు ఈ వృత్తిలోకి రాకూడదని చదివించే ప్రయత్నం చేస్తున్నాం.



బతికినంత కాలం ఇంతే
పిల్లి రమణమ్మ

నా భర్త మృతి చెందాడు. బతకడం కోసం ఇదే వృత్తిని నమ్ముకున్నాను. వృత్తి మీద ఉన్న గౌరవంతో ఏ పనికీ వెళ్లలేకపోతున్నాను. ఏళ్లతరబడి ఇదే పని చేయడంతో చేతులు కాయలు కాచిపోయాయి. వేరే పనేదీ రాదు. బతికినంత కాలం ఇలా గడపాల్సిందే.



సంపాదించిందేమీ లేదు
మొగ్గ అప్పాయమ్మ

ఊహ తెలిసినప్పటి నుంచి ఇదే వృత్తిలో ఉన్నాను. నాకు ఇప్పుడు 70 సంవత్సరాలు. సంపాదించింది ఏమీ లేదు. రోజంతా కష్టపడితే తిండి ఖర్చులొస్తాయి తప్ప మిగిలిందేమీ లేదు. ఇలాంటి పరిస్థితి రాకూడదనే మనుమడిని, మనవరాలిని చదివిస్తున్నాం.

ఖాతాదారుల అభిరుచి మేరకు

ఆభరణాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ తమ ఖాతాదారుల అభిరుచికి తగినట్టుగా కొత్త కొత్త డిజైన్స్ అందించడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని విన్నర్ వీల్ క్లబ్ జిల్లా చైర్మన్ వి.శ్రీదేవి అన్నారు. గురువార స్థానిక షోరూమ్‌లో ఏర్పాటు చేసిన బ్రాండెడ్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆభరణల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సంస్థ వార్షికాదాయం నుండి గణనీయమైన వాటాను సేవా కార్యక్రమాలకు కేటాయించడం అభినందనీయమన్నారు. సంస్థ డైరెక్టర్లు ఫియాజ్, అర్జున్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలు అందించడంలో తమ సంస్థ ముందుంటుందన్నారు. తమ సంస్థ అందించే ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యంతో హుందాతనంతో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ అజిత్, విన్నర్ వీల్ క్లబ్ నాయకులు రత్నకుమారి, రత్నమాల, కె.విజయలక్ష్మి, చీడే అమ్మాజీ పాల్గొన్నారు.


మలబార్ గోల్డ్‌లో ఆభరణాలను ప్రదర్శనను తిలకిస్తున్న వీనర్ వీల్ క్లబ్ జిల్లా చైర్మన్ వి.శ్రీదేవి


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

భీమడోలులో స్వచ్ఛతే సేవ

ప్రజాశక్తి – భీమడోలు

బహిరంగ మలవిసర్జన పర్యావరణానికి, ప్రజా ఆరోగ్యానికి చేటని స్థానిక శ్రీవెంకటేశ్వర కళాశాల ప్రిన్సిపల్ వంగా నాగేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్సిసి వలంటీర్లు బహిరంగ మలవిసర్జన రహిత ర్యాలీని నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పురవీధుల్లో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ మలవిసర్జన రహిత సమాజ నిర్మాణానికి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్–ఎస్ అధికారులు జె.రాము, ఎస్.రాము, ఎన్సిసి అధికారి కె.శివశంకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మందలపర్రు మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి – నిడమర్రు

మందలపర్రు మాజీ సర్పంచి, వైసిపి రాష్ట్ర నాయకులు గాదిరాజు వెంకటసుబ్బరాజు (పెదబాబు) తండ్రి గాదిరాజు గోపాలకృష్ణంరాజు (72) బుధవారం రాత్రి హైదరాబాద్లో ఆయన కుమార్తె ఇంటి వద్ద గుండె పోటుతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని గురువారం మందలపర్రులోని ఆయన స్వగృహానికి తీసుకురావడంతో నిడమర్రు, గణపవరం మండలాల్లోని వైసిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున మందలపర్రు చేరుకున్నారు. గోపాలకృష్ణంరాజు 1981 – 85 వరకూ మందలపర్రు గ్రామ సర్పంచ్గా విధులు నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడైన గాదిరాజు వెంకటసుబ్బరాజు (పెదబాబు) వైసిపి రాష్ట్ర నాయకులుగా కొనసాగుతున్నారు. గురువారం ఉదయం గోపాలకృష్ణంరాజు మృతదేహాన్ని సందర్శించేందుకు తాడేపల్లిగూడెం మాజీ ఎంఎల్ఎ పసల కనకసుందరరావు, వైసిపి రాష్ట్ర నాయకులు మోషేన్రాజు, ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల వాసుబాబు మందలపర్రు చేరుకుని పెదబాబును పరామర్శించారు.

ఆత్మగౌరవ దీక్ష ర్యాలీ

ప్రజాశక్తి – గణపవరం

స్థానిక శ్రీచింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం ఆత్మగౌరవ దీక్షలో భాగంగా చెంబు శవయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ దిమ్మ నుండి పిహెచ్సి మీదుగా ఆ కళాశాల వరకూ ఈ యాత్ర కొనసాగింది. బహిరంగ మలవిసర్జన మానుకోవాలని, ఆత్మగౌరవం కాపాడుకోవాలని పెద్ద పెట్టున విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ కె.అరుణకుమారి మాట్లాడుతూ ప్రజలందరూ బహిరంగ మలవిసర్జన మానుకోవాలని సూచించారు. అప్పుడే స్వచ్ఛాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నల్లి రవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్ బాబ్జీ, సౌజన్య, సాయిబాబా, కిరణ్బాబు, మల్లేశ్వరరావు, దొర పాల్గొన్నారు.

ఉంగుటూరు : బహిరంగ మలవిసర్జనతో ఆత్మగౌరవం దెబ్బతింటుందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డను విధిగా వినియోగించాలంటూ నారాయణపురం జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. బహిరంగ విసర్జన చేయొద్దంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి – తణుకు రూరల్

భీమ్ – కోరేగావ్ ఘటనలో దళితుల మీద దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని గురువారం సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ నరేంద్రమోడీ అధికారంలోకొచ్చిన తరువాత దేశంలో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. దళితులపై, మైనార్టీలపై దాడులకు పాల్పడుతున్నా ప్రధాని నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. వైసిపి నాయకులు కౌరు వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు అనుకుల రమేష్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వైసిపి నాయకులు ఆకుల కిరణ్, సిపిఎం మండల కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కోరాడ సుధీర్ బాబులు మాట్లాడుతూ దాడులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొట్ల సురేష్, జి.రంగారావు, ఐద్వా డివిజన్ కార్యదర్శి కె.నాగరత్నం, డివైఎఫ్ఐ నాయకులు ధనాల అప్పారావు, ఎం.గోవిందరావు పాల్గొన్నారు.

వసుధా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి – తణుకు రూరల్

వసుధా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని దువ్వ గ్రామంలో గురువారం జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా స్థానిక పాఠశాల నెం – 3లో వసుధా ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేందుకు వసుధా ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కట్టా అనంత లక్ష్మి, జెడ్పిటిసి సభ్యులు ఆత్కూరి బుల్లిదొరరాజు, సర్పంచ్ ధనాల లక్ష్మి, కసాని కుమారి, కాకి రాముడు, ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు పాల్గొన్నారు.


వాటర్ ఫిల్టర్ను ప్రారంభిస్తున్న బాపిరాజు

7 నుంచి రఘువీరారెడ్డి పర్యటన

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం అర్బన్

పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలుచోట్ల పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి దుర్గా రామచంద్రరావు తెలిపారు. గురువారం స్థానిక గాంధీ మండపంలో జరిగిన ఆ పార్టీ, ఇతర అనుబంధ సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ 7, 8, 9, 10 తేదీల్లో రఘు వీరారెడ్డి పర్యటిస్తారన్నారు. ఈ మేరకు ఏడో తేదీ తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద పాదయాత్ర ప్రారంభించి కొవ్వూరు మీదుగా పదో తేదీ పోలవరం చేరుకుంటారన్నారు. ఈ యాత్రలో పుదుచ్చేరి ముఖ్యమంత్రి పి.నారాయణస్వామి, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు మల్లిఖార్జున ఖర్గే, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, రైతులు పాదయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు మునిపర్తి కోదండరామం, మండల అధ్యక్షులు ఖండవల్లి రామచంద్రరావు పాల్గొన్నారు.

అవినీతిపై సమగ్ర విచారణ అవసరం

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం రూరల్

దేవాదాయ ధర్మాదాయ శాఖలో అవినీతి తిష్ట వేసిందని, ముఖ్యమంత్రి సమగ్ర విచారణ జరిపితే రూ.కోట్ల అక్రమాలు వెలుగు చూస్తాయని వైసిపి నాయకులు కొట్టు సత్యనారాయణ దుయ్యబట్టారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ దేవాదాయశాఖ అవినీతిమయంగా మారుతోందని, శ్రీకాళహస్తి భూముల విషయంలో రూ.కోట్లు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. విజయవాడ ఆలయంలో క్షుద్రపూజలు జరగలేదని సిబ్బందిని మంత్రి వెనకేసుకొస్తున్నారని విమర్శించారు. అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధి వేతనాల బకాయిలు చెల్లించేదెప్పుడు..?

'జన్మభూమి మా ఊరు'లో నిలదీత


జన్మభూమిలో అధికారులను ప్రశ్నిస్తున్న కూలీలు

ప్రజాశక్తి – భీమడోలు

మండలంలోని సూరప్పగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన జన్మభూమి మాఊరు సభలో ఉపాధి కూలీలు తమ బకాయిలు చెల్లింపుపై అధికారులను ప్రశ్నించారు. కొన్ని నెలలుగా బకాయిలు పేరుకుపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నామని వాపోయారు. ఉపాధి కూలీలకు వేతన రశీదులు ఇవ్వకపోవడంతో ఎంత కూలీ వచ్చిందన్నది తెలియడం లేదన్నారు. మీసేవలో రశీదు వివరాల కోసం రూ.పది చొప్పున చెల్లించాల్సి వస్తోందన్నారు. ఉపాధి పథకం కింద ప్రకటించిన పనులను చేసేందుకు కూలీలు ముందుకొచ్చినప్పటికీ అధికారులు వాటి కేటాయింపులో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వేతనాలను త్వరలో చెల్లిస్తారని సర్ది చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్లు వి.సత్యకుమారి, ఎస్.సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం అర్బన్

వినూత్నమైన సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 12వ వార్డులో కౌన్సిలర్ శ్రీరాముల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. సుమారు రూ.40 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేశామని రాబోయే రోజుల్లో మరో రూ.60 కోట్ల అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కిల్లాడి ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు తాతికాయల వీరన్న, ఎంఇ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని అంబరుపేట గ్రామంలో గురువారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని బహిరంగ మల విసర్జన రహితంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకుని వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో పురవీధుల్లో ఒడిఎఫ్ ర్యాలీ నిర్వహించారు. సభలో పాల్గొన్న రాష్ట్ర హస్త కళల ఛైర్మన్ పాలి ప్రసాద్, టిడిపి ఎస్సి సెల్ కార్యదర్శి కె.జయరాజు పాల్గొన్నారు.

నిడమర్రు : గురువారం భువనపల్లిలో నిర్వహించిన జన్మభూమి మాఊరు సభలో గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం గ్రామ శాఖ ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులుకు వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కార్యదర్శి ఎన్.రమణారావు మట్లాడుతూ జన్మభూమి సభ పెన్షన్లు, రేషన్కార్డుల మంజూరుకే పరిమితమైందన్నారు. గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే గ్రామంలో శ్మశానవాటికకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దహన సంస్కారాలకు రెండు ప్లాట్ఫాంలు ఏర్పాటు చేయాలని, స్నానాలకు పైపులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వేంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

నిడమర్రులో..

స్థానిక పంచాయతీ వద్ద నిర్వహించిన జన్మభూమి మాఊరు సభకు గ్రామ సర్పంచ్ సంకు లక్ష్మీపార్వతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని, త్వరలో పట్టాలు కూడా మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుందరరాజు, ఎంపిపి నిమ్మల మాణిక్యాలరావు, వైస్ ఎంపిపి పి.నక్షత్రం, మండల జెఇ రాంబాబు, ఇఒపిఆర్డి విజయ భాస్కరరావు, తెలుగుదేశం నాయకులు సంకు రాంబాబు, అంబళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చానమిల్లిలో..

దాళ్వా సీజన్లో సాగునీటి కొరత లేకుండా చూస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గురువారం చానమిల్లిలో జరిగిన జన్మభూమి మాఊరు సభలో ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. స్థానిక పంచాయతీ వద్ద ఆ గ్రామ సర్పంచి విజయరామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ గన్ని మాట్లాడుతూ దాళ్వాకు వంతుల వారీ విధానం ద్వారా సాగు నీరు అందిస్తామన్నారు. చానమిల్లి రహదారి నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారి మురళీకృష్ణ, ఎంపిడిఒ డి.దామోదరరావు, ఎంఇఒ నరసింహమూర్తి, ఆర్డబ్ల్యు జెఇ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గణపవరం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు జన్మభూమి మాఊరు సభలు నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు తెలిపారు. గురువారం మండలంలోని వెలగపల్లి, జల్లికొమ్మర, చిలకంపాడు, కామట్లపాలెంలో ఏర్పాటు చేసిన జన్మభూమి సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.మధుసూదనరావు, ఎంపిడిఒ పద్మ, ఎఒ కె.పార్థసారథి, టిడిపి మండల అధ్యక్షులు దండు వెంకటరామరాజు, టిడిపి సీనియర్ నాయకులు నాయుడు రామచంద్రరావు, మండల సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షులు ఇంటూరి చంద్రమోహన్రావు పాల్గొన్నారు.


ఉంగుటూరు : గురువారం కైకరం, యర్రమిల్లిపాడు, కంసాలిగుంటలో జరిగిన సభల్లో పాల్గొన్న స్థానిక ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు చింతల శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షులు కడియాల రవిశంకర్, సర్పంచ్లు పోతురాజు, సుజీవరావు, పిప్పర శ్రీను పాల్గొన్నారు.

'జన్మభూమి - మాఊరు'లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - దేవరపల్లి

తాడిపూడి కాలువ ద్వారా సాగునీరు అందడం లేదని, దీనిపై ఆధారపడి సాగు చేస్తున్న మూడు వేల ఎకరాల పంటభూముల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని మండలంలోని యాదవోలు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో అధికారులను, ప్రజా ప్రతినిధులను రైతులు నిలదీశారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపిపి ఎస్‌వి.నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాగు నీరు అందకపోవడంతో ప్రతి ఏడాదీ రైతులు ఇబ్బంది పడుతున్నారని, సమస్యకు పరిష్కారం మాత్రం చూపడం లేదంటూ సంబంధిత ఇరిగేషన్ ఎఇని రైతులు నిలదీశారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ ఎఇ మాట్లాడుతూ త్వరలోనే పనులకు టెండర్లు నిర్వహిస్తామని, నెలరోజుల గడువులోనే పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు సూరి శివచంద్రరావు, తెలుగుదేశం నాయకులు అనిశెట్టి ప్రభాకరరావు, ఉప సర్పంచి అనిశెట్టి శ్రీనివాసు, ఎంపిడిఒ కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : గురువారం మండలంలోని పాలంగి, కేశవరం గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు పాల్గొన్నారు. సభ ముగిసే సమయానికి పాలంగిలో అధిక సంఖ్యలో మహిళలు తాము దీర్ఘకాలంగా ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామని త్వరితగతిన తమకు స్థలాలు ఇప్పించాలని కోరుతూ వేదిక వద్దకు చేరుకున్నారు. వారిని సముదాయిస్తూ జెడ్‌పిటిసి ఇళ్ల స్థలాల సమస్య తమ దృష్టిలో ఉందన్నారు. అయితే పట్టణానికి ఆనుకొని ఉన్న గ్రామం కావడంతో స్థలాల రేట్లు ఎక్కువగా ఉన్నాయని అయినప్పటికీ జీప్లస్-2 భవనాలు నిర్మించి లబ్ధిదారులకు



గోపాలపురంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

ఇళ్లు ఇచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. చివటం వద్ద జరిగిన సభలో పలువురు వృద్ధులు తమకు పింఛన్లు రావడంలేదని వాపోయారు. కార్యక్రమంలో ఎంపిపి తొర్లపాటి సర్వేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, ఎంపిడిఒ వీరాస్వామి పాల్గొన్నారు.

గోపాలపురం : రాష్ట్రం అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి చెప్పుకుంటుంటే తెలుగు తమ్ముళ్ల మాత్రం అక్రమాలకు నిలయంగా మారారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. గురువారం మండలంలోని సగ్గొండ, వాదాలకుంట, సంజీవపురం గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. సగ్గొండ పంచాయతీ గోపవరం గ్రామంలోని రైతులకు తాడిపూడి లిఫ్టు నుండి విడుదలవుతున్న సాగు నీరు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో డ్రయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవ డం లేదని ప్రజలు ఆరోపించారు. అనంతరం వైస్ ఎంపిపి మేణ్ణి రత్నాజీ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా పరిపాలన సాగించడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వాదాలకుంటలో..

మండలంలోని వాదాలకుంటలో తహశీల్దార్ ఎస్.నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమిలో పలు సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. వాదాలకుంట నడి బొడ్డున ఉన్న చెరువు అన్యాక్రాంతం అయ్యిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాక్రాంతం అయిన చెరువును సర్వే చేయాలని కలెక్టరు ఆదేశించినా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కబ్జా చేసింది అధికార పార్టీ నాయకులే కావడంతో అధికారుల చర్యలు శూన్యంగా ఉన్నాయని దుయ్యబట్టారు. పాత మరుగు దొడ్లకు రంగులు వేసి నాయకులు డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. పొలాల్లోకి వెళ్లే లింకు రోడ్లను నిర్మించకుండా రూ.లక్షలను సొమ్ముచేసుకున్నారని తెలిపారు. మండలంలోని మూడు గ్రామాల్లో ఒకే రోజు జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రత్యేక అధికారి ఎక్కడా ఫిర్యాదులు స్వీకరించకపోవడం గమనార్హం. కార్యక్రమంలో ఎంపిపి గద్దే అరుణ పాల్గొన్నారు.

తాళ్లపూడి : తమ గ్రామంలో తిష్ట వేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ పెద్దేవ గ్రామానికి చెందిన పలువురు ప్రజలు గురువారం నిర్వహించిన జన్మభూమి సభలో అధికారుల ఎదుట విన్నవించుకున్నారు. గ్రామ సర్పంచ్ లక్ష్మీకాంతం అధ్యక్షతన జన్మభూమి సభ జరుగుతున్న సమయంలో పలువురు స్థానికులు మాట్లాడుతూ తమ గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకూ పట్టించుకోలేదని వాపోయారు. అలాగ ఎస్‌టి ఏరియా సిమెంట్ రోడ్డుకు సమీపించే రహదారిని నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని ప్రజలు, రైతులు అధికారుల ఎదుట తమ గోడు విన్నవించుకున్నారు. అనంతరం జన్మభూమి సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సభలో ఎంపిపి కాసాని అనంతలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కె.మంగాభవాని, ఎంపిడిఒ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సోలార్ పంపు సెట్ల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు జిల్లాల్లో రైతులకు అవసరమైన సోలార్ పంపుసెట్లను త్వరితగతిన అందించేందుకు చర్యలు వేగవంతం చేశామని ఆ శాఖ సిఎండీ హెచ్‌వై.దొర తెలిపారు. తాళ్లపూడి, గోపాలపురం మండలాల్లోని రైతులకు అందజేసిన సోలార్ పంపుసెట్ల వినియోగం, వాటి పనితీరును పరిశీలించేందుకు గురువారం దొర మండలంలో పర్యటించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇపిడిటిఎల్ పరిధిలో నాలుగు వేల సోలార్ సెట్లు అవసరమని గుర్తించగా ఇంతవరకూ 2,400 సెట్లను మంజూరు చేశామన్నారు. జిల్లాలో 860 పంపు సెట్లు ఇవ్వాల్సి ఉండగా 196 ఇచ్చినట్లు తెలిపారు. ఈ పంపు సెట్ల వాడకానికి పాత మోటర్ల స్థానంలో కొత్త మోటర్లు ఇవ్వడంతో 50 శాతం విద్యుత్ ఆదా అవుతుందని, దీంతో రైతులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. దీనికి తోడు కరెంట్ బ్రేక్‌డౌన్ ఉండదన్నారు.

నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంటర్, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మరాజుపాలెంలోని మండల పరిషత్ పాఠశాలలో రోటరీయన్ బండి వేణుగోపాలకృష్ణ ఆర్థిక సహాయంతో వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కోరుమామిడి నీటి సంఘం అధ్యక్షులు రోటరీయన్ నాగేశ్వరరావు చేతుల మీదుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కూచుపూడి వీర వెంకట రామారావు మాట్లాడుతూ నిడదవోలు రోటరీ సెంటర్ ద్వారా ఆరు నెలలుగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి విశేష సేవలందిస్తున్నారన్నారు. రోగులకు ఆపరేషన్‌తో పాటు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ నేత్ర శిబిరంలో దాదాపు 200 మంది రోగులను పరీక్షించి 80 మందికి కళ్లజోళ్లను సిఫార్సు చేసి రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంటర్ ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బండి గోపాలకృష్ణ, జాతీయ సేవా పథకం అధికారి మురళీ కృష్ణ, కార్యదర్శి విడి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నేత్రాలయ సిబ్బంది

గంగాధరరావు, ట్రెజరర్ చింతల కిషోర్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముళ్లపూడి వెంకటరావు, రోటరీ జిల్లా సెక్రటరీ జి రాఘవయ్య, ప్రత్తిపాటి త్రిమూర్తులు, నీరుకొండ సుబ్రహ్మణ్యం, బిఎన్‌వి.ప్రసాద్, ఎమ్.రామకృష్ణ పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి వైద్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల చేరవేతే లక్ష్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి జన్మభూమి మాఊరు కార్యక్రమం దోహదపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. కొవ్వూరులో గురువారం ఏడో వార్డులో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో మంత్రి జవహర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జె.రాధారాణి, ఎఎంసి ఛైర్మన్ వేగి చిన్నా, ప్రత్యేక అధికారి సత్యనారాయణ బాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, వార్డు కౌన్సిలర్ ఎస్.సత్యవతి, టిడిపి నాయకులు జెవిఎస్.చౌదరి పాల్గొన్నారు.

చాగల్లు : మండలంలో చిక్కాల, కలవలపల్లి పంచాయతీల వద్ద గురువారం నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కెఎస్.జవహర్ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి, ప్రజల అవసరాలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్

వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఎక్సైజ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సారా రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి జి.రేఖారాణి, మండల ప్రత్యేకాధికారి పిఎల్ వరలక్ష్మి, తహశీల్దారు ఎం.మేరికమ్మ పాల్గొన్నారు.

దేవరపల్లి : మండలంలోని యర్నగూడెంలో గురువారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కె.సుధారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛన్లు, రేషన్‌కార్డులు, చంద్రన్న కానుకలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రవికుమార్, సర్పంచి గుమ్మడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి బాదంపూడి ఇందిర, సొసైటీ అధ్యక్షులు గద్దె వెంకట రామారావు పాల్గొన్నారు.

తాళ్లపూడి : ప్రజా సాధికారిత సర్వేలో నమోదు అవ్వకపోతే ఎటువంటి సబ్సిడీ పథకాలు అందవని జన్మభూమి మా ఊరు కార్యక్రమం కొవ్వూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రేఖారాణి అన్నారు. తాళ్లపూడిలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పింఛను అందేలా చర్యలు తీసకోవాలని ఎంపిడిఒని ఆమె ఆదేశించారు.

7 నుంచి మహాపాదయాత్ర

ప్రజాశక్తి - కొవ్వూరు

పోలవరం ప్రాజెక్టు సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకూ మహ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బిసిసి అధ్యక్షులు రఫిలా బేగ్ తెలిపారు. ఈ పాదయాత్ర ఏడో తేదీన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుండి బయలుదేరి తొమ్మిదో తేదీన పోలవరంతో ముగుస్తుందన్నారు. పదో తేదీన పోలవరంలో సామూహిక సత్యాగ్రహ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 2018-19 నాటికి పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తిచేయాలని, రాష్ట్రానికి ఆర్థిక భారం లేకుండా కేంద్రమే పోలవరాన్ని పూర్తిచేయాలని, నిర్వాసితులకు పూర్తి న్యాయం చేకూర్చలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలనే డిమాండ్స్ సాధన కోసం ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి పాల్గొంటారన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ

ప్రజాశక్తి - కొవ్వూరు

స్థానిక పురపాలక సంఘం చేపట్టిన స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పురపాలక సంఘం కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు, బస్టాండు సెంటర్ మీదుగా విజయ విహార్ సెంటర్‌కు చేరింది. ఆ సెంటర్‌లో విద్యార్థులు మానవహారాన్ని నిర్మించారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించి వారిని చైతన్య పరిచేందుకు గానూ, స్వచ్ఛ కొవ్వూరును నిర్మించేందుకు గానూ మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ర్యాలీలో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : స్వచ్ఛభారత్‌లో భాగంగా బహిరంగ మల విసర్జనను నిర్మూలిద్దాం, ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుందాం అనే నినాదంతో స్థానిక ఆదిత్య డిగ్రీ విద్యా సంస్థల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ విధిగా మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, బహిరంగ మల విసర్జన ఆరోగ్యానికి మంచిది కాదని సూచించారు. కార్యక్రమంలో ఆ కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాసు, ప్రిన్సిపల్ అనురాధ, సత్యనారాయణ, హరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ క్లబ్‌గా నిడదవోలు లయన్స్‌క్లబ్

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలోని లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు లభించినట్లు ఆ క్లబ్ అధ్యక్షులు మట్టపర్తి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల తణుకులో నిర్వహించిన లయన్స్‌జోన్ సోషల్ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ కెవి.కిషోర్‌కుమార్ క్లబ్ నిర్వహించిన పలు సేవాకార్యక్రమాలను పరిశీలించి ఈ అవార్డును అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్‌పర్సన్ ఎమ్.నాగజ్యోతి, వైస్ డిస్ట్రిక్ గవర్నర్ వంగా రవీంద్రనాద్, రీజనల్ ఛైర్‌పర్సన్ ఆర్.ప్రవీణ్‌చంద్, ఎమ్.విమల్‌కుమార్‌జాన్, బండి మల్లికార్జునరావు, కార్యదర్శి ఎస్‌యు.ముజీబ్, కెఎస్ఎన్.రాము, రొంగల చెల్లారావు పాల్గొన్నారు.

బ్రెయిలీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

అంధుల అభ్యున్నతికి బ్రెయిలీ చేసిన కృషి ఎనలేనిదని, ఆయన సేవలు చిరస్మరణీయమని పోచవరం ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇ.సంపత్‌రావు అన్నారు. పాఠశాలలోని బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అంధుల చేతివేళ్లతో అక్షరాలను, అంకెలను గుర్తుపట్టే విధంగా బ్రెయిలీ లిపిని తయారు చేశారని ఈ లిపితోనే నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎందరో అంధులు జీవనోపాధిని సాగిస్తున్నారన్నారు. విద్యార్థులకు లూయీ బ్రెయిలీ జీవితాన్ని వివరించారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కేశాలమ్మ , శ్రీను, భద్రాచలం పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సజాడో వలంటరీ ఆర్గనైజేషన్ ద్వారా దర్భగూడెం జన్మభూమి సభలో వృద్ధులకు, పేదలకు దుప్పట్లు, చీరలు ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ వారిని ఎంఎల్ఎ మొడియం అభినందించారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు, జీలుగుమిల్లి ఎంపిడిఒ అన్నపాలిన అత్తగారు దాసి కాంతమ్మ జ్ఞాపకార్థం స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రతిఏడాది సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గతఏడాది బుట్టాయగూడెంలో గిరిజన గ్రామాల్లో పంపిణీ చేసామని ప్రస్తుతం ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రభుత్వ పిలుపును అందుకుని ఈ సేవా కార్యక్రమం గురువారం చేపట్టినట్లు ఎంపిడిఒ అన్నపాలిన తెలిపారు.

7 నుంచి కాంగ్రెస్ మహాపాదయాత్ర

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, 2018-19 నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలని, కేంద్రమే ప్రాజెక్టును నిర్మించాలని కోరుతూ ఈ నెల ఏడో తేదీ నుండి పదో తేదీ వరకూ ధవళేశ్వరం నుండి పోలవరం వరకూ మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రఫీఉల్లా బేగ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. యాత్ర కొవ్వూరు నుండి కాపవరం, దొమ్మేరు, మలకపల్లి, తాళ్లపూడి మీదుగా పట్టిసీమకు తొమ్మిదో తేదీ నాటికి చేరుతుందన్నారు. రాత్రికి అక్కడ బసచేసి పదో తేదీ ఉదయానికి పోలవరం చేరుకుంటుందని చెప్పారు. స్థానిక భాను థియేటర్ వద్ద రెండు గంటలపాటు సత్యాగ్రహ దీక్ష చేసి అనంతరం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపీలు, మాజీ ఎంఎల్ఎలు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ముఖ్యంగా కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి, ఆల్ ఇండియా కాంగ్రెస్ నాయకులు మాల్లికార్జున్ కార్గే పాల్గొంటారని చెప్పారు.

కల్యాణికి పలువురి అభినందన

ప్రజాశక్తి- టి.నరసాపురం

సావిత్రిబాయిపూలె అవార్డు పొందిన గుర్వాయిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టిఎస్.కళ్యాణిని గురువారం పలువురు అభినందించారు. డిఇఒ ద్వారా అవార్డు అందుకున్న ఆమెను ఎంఇఒ టి.రామ్మూర్తి, ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు ఎన్‌వి.చలపతిరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జయవరపు శ్రీరామ్మూర్తి, తహశీల్దారు ఎన్.నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆత్మగౌరవ దీక్షలను పురస్కరించుకుని ర్యాలీ

బుట్టాయగూడెం : ప్రభుత్వం చేపట్టిన ఆత్మగౌరవ దీక్షలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూబొమ్మ సెంటర్‌లో ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల పీడీ నాగభూషణం, మల్లేశ్వరరావు, శివాజీ, సుభాషిణి ఉన్నారు.

సాయిబాబా ఆలయానికి గ్యాస్ స్టౌ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రోటరీ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండు సెంటరు సాయిబాబా ఆలయానికి గ్యాస్ స్టౌ అందజేశారు. రిటైర్డ్ అధ్యాపకురాలు దుగ్గిరాల దుర్గాదేవి ఆర్థిక సహకారంతో ఈ స్టౌను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షకార్యదర్శులు చల్లారి మాణిక్యాలరావు, జె.ఉమావెంకటేష్, ఆలయ అర్చకులు దర్భా వెంకటసుబ్రహ్మణ్యం, రోటరీ అసిస్టెంటు గవర్నర్ ధనకుమార్ పాల్గొన్నారు.



గ్యాస్ స్టౌ అందిస్తున్న రోటరీ సభ్యులు

నిరసనలు.. నిలదీతలు..!

జన్మభూమి సభల తీరు



సీతానగరం గ్రామసభలో సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పోలవరం: చేగొండపలి పునరావాస గ్రామంలో జరిగిన జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో పునరావాస గ్రామ ప్రజలు, నిర్వాసితులు అధిక విద్యుత్ బిల్లులపై అధికారులను నిలదీశారు. నిర్వాసిత గ్రామాల నుంచి పునరావాసాలకు తరలించేటప్పుడు నివాసాలు నిర్మించుకునే వరకూ అన్ని వసతులు కల్పిస్తామని, అద్దె ఇళ్లలో ఉండి ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారులు గ్రామాలు ఖాళీ చేయించారని, కానీ నేటికీ ఇళ్లకు చెల్లిస్తామన్న అద్దె సొమ్ములు చెల్లించ లేదన్నారు. ఇల్లు కూడా నాణ్యత లేకుండా నిర్మించడం వలన వర్షం వస్తే నీటికి చెమ్మగిల్లుతున్నాయని, ఇక్కడకు వచ్చిన నాటి నుండి ఇప్పటివరకూ విద్యుత్ బిల్లులు సక్రమంగా కట్టినా అధిక మొత్తంలో బిల్లులు వస్తున్నాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ శాఖ అధికారులను అడిగితే కచ్చితంగా కట్టి తీరాల్సిందేనని చెబుతున్నారని, సాధారణ నివాసాలకు కూడా వేలాది రూపాయల బిల్లులు వస్తుంటే ఎలా కట్టాలని ప్రశ్నించారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారి వై.రమేష్ బాబు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్టిఇలకు 75 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ ఇస్తామని 75 యూనిట్లు దాటిన వారికి మొత్తం బిల్లు పడుతుందని వివరణ ఇచ్చారు. ఆర్అండ్ఆర్‌లో ఉన్న పునరావాస గ్రామ ప్రజలకు ఈ విషయంలో విచారించి తగు న్యాయం చేస్తామన్నారు. ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్‌కుమార్ దొర మాట్లాడుతూ నేటికీ కొన్ని గ్రామాల్లో ప్రజలకు అందాల్సిన పరిహారాలు అందలేదని, గ్రామాల్లో రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం జరగాల్సి ఉందని, ఉందని నాణ్యత లేకుండా నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు నేటికీ చేయించలేదన్నారు. మెత్తప్పకోట గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించి, ట్రాక్టర్ ప్రమాదంలో మతిచెందిన కుటుంబానికి, గాయపడిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాలను విడిచి పునరావాస గ్రామాలకు తరలి వచ్చిన తమకు జీవనోపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వమే పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు పౌష్టికాహార ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి - చింతలపూడి

'గత 'జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఇచ్చిన దరఖాస్తులనే ఇప్పటి వరకూ పరిష్కరించలేదు.. ఇప్పుడు తీసుకున్న దరఖాస్తులను ఎప్పుడు పరిష్కరిస్తారు' అంటూ మండలంలోని సీతానగరంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో అధికారులను ప్రజలు నిలదీశారు. ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సభాప్రాంగణంలో తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ఇలాంటి కార్యక్రమాలు ఎవరి కోసం నిర్వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. సీతానగరం గ్రామంలో ఉన్న గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు అన్నారు. అధికారులు పర్యవేక్షణకు వచ్చి ముడుపులు తీసుకుని ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని స్థానికులు మండిపడ్డారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనకు స్థానిక ఎస్‌సి కాలనీ ప్రజలు ఇబ్బందులు పడు తున్నారన్నారు. సీతా నగరం గ్రామంలో ఇప్పటి వరకూ శ్మశాన వాటిక లేదని గ్రామస్తులు స్థానికంగా ఏర్పాటు చేసుకున్న కాలువ పక్కన ఉన్న 35 సెంట్ల భూమిని అధికారులు శ్మశాన వాటికకు కేటాయించాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

ఎర్రగుంటపల్లిలో రసాభాస

ఎర్రగుంటపల్లి గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమం రసాభాసగా సాగింది. ఈ కార్యక్రమాన్ని రైతులు అడ్డుకున్నారు. చింతలపూడి ఎత్తిపోతల కాల్వలో భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రగుంటపల్లిలో శ్మశాన వాటికకూ లేదని దానికి స్థలం కేటాయించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. జన్మభూమి కార్యక్రమంలో సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన రైతులను అధికారులు పోలీసులతో నిర్బంధించడం అప్రజాస్వామికమని సిపిఐ నాయకులు పి.సోమశేఖర్ అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో సమస్యలు విన్నవించుకోవడానికి అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక 9,10,11,12 వార్డుల్లో జరిగిన జన్మభూమి మాఊరు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాడవాడలా చంద్రన్న బాట పథకం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంఎల్ఎ పీతల సుజాత అన్నారు. గురువారం పేరంపేటలో నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేక అధికారి భానుప్రసాద్, ఎంపిపి కొడవటి మాణిక్యాంబ, ఎంపిడిఒ శ్రీదేవి, టిడిపి మండల అధ్యక్షులు దాకారపు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

టి.నరసాపురం: జన్మభూమి - మా ఊరుకార్యక్రమంలో వచ్చిన వినతులను రెండు నెలల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని బందంచర్ల, కె.జగ్గవరం గ్రామాల్లో జన్మభూమి మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థఛైర్మన్ జయవరపు శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి సభ్యులు చలపతిరావు, ఎంపిపి శీలం వెంకటేశ్వరావు ద్వారా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని మధు, బొంతు సత్యనారాయణ, ప్రత్యేక అధికారి కుమార్, సర్పంచులు పి.ప్రభాకర్, తానంకి కుమారి, కె.పార్థసారధి, ఘంటా సతీష్, వాసిరెడ్డి రామ్మోహనరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ప్రజాసమస్యల పరిష్కారానికి జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు దోహదపడుతాయని నోడల్ ఆఫీసర్, మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని నిమ్మలగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జన్మభూమి సభలో ఆయన మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి తహశీల్దారు జి.ఉదయభాస్కర్, వైస్‌ఎంపిపి సున్నం నాగేశ్వరరావు, సర్పంచి కుర్ల సీత, టిడిపి మండల అధ్యక్షులు మగపర్తి



లింగపాలెంలో..



కొయ్యలగూడెంలో..

సొంబాబు, ఎటిడబ్ల్యూఒ జె.సత్యనారాయణదొర, ఎంఇఒ టి.బాబూరావు, పలు శాఖలవారు పాల్గొన్నారు.

లింగపాలెం : సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ పీతల సుజాత అన్నారు. ధర్మాజీగూడెంలో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం అర్హులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పెదబాబు, ఎంపిపి మల్లికార్జునరావు, ప్రత్యేక అధికారి గణేష్‌కుమార్, సర్పంచి వరప్రసాద్, సొసైటీ అధ్యక్షులు గారపాటి బుజ్జియ్య, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పాతూరి శ్రీనివాసరరావు(స్వామి) తహశీల్దార్ బి.సోమశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు అన్నారు. మండలంలోని బోడుగూడెం గ్రామంలో తహశీల్దారు కె.కృష్ణజ్యోతి ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతల వెంకటరమణ, ఎంపిపి అయినపర్తి చందన, వైస్ ఎంపిపి పారేపల్లి శ్రీను, సర్పంచులు శుక్లబోయిన వెంకట సత్యనారాయణ, గొడ్డాటి రాణి, ఉప సర్పంచి గర్రే వీరభద్రం నాయకులు దుగ్గిరాల విజయభాస్కరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో లైసెన్స్‌మేళా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపరవాణా కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక రవాణాశాఖ కార్యాలయ పరిధిలో వాహన లైసెన్సు మేళా నిర్వహించినట్లు ఎంవిఐ సిహెచ్.వెంకటరమణ తెలిపారు. గురువారం మండలంలోని నోవా ఇంజనీరింగ్ కళాశాలలో వాహనాలు నడిపే వారికి లైసెన్సు మేళా నిర్వహించారు. 124 మందిని అర్హులుగా గుర్తించి ఎల్ఎల్ఆర్ ధ్రువపత్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంవిఐ శ్రీనివాస్, డిఎస్‌పి సిహెచ్.మురళీకృష్ణ, సిఐ కె.బాలరాజు, ఎస్ఐ విష్ణువర్ధన్, నోవా కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

కారెం శివాజీ పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎస్‌సి, ఎస్టిఇ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజి పర్యటనను జయప్రదం చేయాలని స్థానిక విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ కోరారు. గురువారం స్థానిక ప్రియదర్శిని కళాశాల వద్ద దళిత గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందశేఖర్ మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీన జంగారెడ్డిగూడెంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల ఏడుకొండలు, పంతగాని వెంకన్న, శ్రీనివాస్, జొన్నకూటి వెంకటేశ్వరావు, అమృతల రంగారావు, కంపా రాజేంద్ర, మానుకొండ కిషోర్, పైడిమాల కృష్ణ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని జంగారెడ్డిగూడెం నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక గంగానమ్మ గుడి వద్ద నుండి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ సెంటరులో విద్యార్థులతో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ అట్లూరి రామ్మోహనరావు, డిఎస్‌పి సిహెచ్.మురళీకృష్ణ, కమిషనర్ కె.కొండలరావు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమయానికి రారు.. సమస్యలు వినరు..!

పత్తాలేకుండాపోతున్న పెనుమంచిలి విఆర్ఒ
సమయానికి తెరవని కార్యాలయం
విసిగిపోతున్న ప్రజలు


కార్యాలయం వద్ద విఆర్ఒ కోసం ఎదురు చూస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంచిలి విఆర్ఒ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి ఆయన లేకపోవడంతో నిరాశే ఎదురవుతోంది. ఉదయం 11 గంటలైనా విఆర్ఒ కార్యాలయం తెరవకపోవడంతో ఆ గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. విఆర్ఒ స్థానికంగా ఉండకపోవడంతో పాటు స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో మండల ప్రజలు సొంతంగా లావాదేవీలు నడిపిస్తూ ఉంటారని, జీతం కంటే అధికంగా డబ్బులు రావడంతో సంతకాలుపెట్టి వెళ్లిపోతారని చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో లేకుండా సొంతపనులు చూసుకునే వారికి ఉద్యోగం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. రేషన్‌కార్డు లేక గ్రామస్తులు సంతకాల కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు. నాలుగుసార్లు రేషన్‌కార్డుకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకూ రేషన్‌కార్డు ఇవ్వలేదని, మరలా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కార్యాలయానికి వచ్చిన ఇక్కడ సమాధానం చెప్పే నాధుడు లేడని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులను నోడల్ ఆఫీసర్లుగా నియమించొద్దు

ప్రజాశక్తి - పాలకొల్లు

'జన్మభూమి - మాఊరు'లో ఉపాధ్యాయులను నోడల్ ఆఫీసర్లుగా నియమించరాదని కోరుతూ పాలకొల్లు యుటిఎఫ్ నాయకులు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల రామ్మోహన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించరాదని చట్టాలు చెబుతుంటే రాష్ట్రంలో రోజురోజుకు బోధనేతర పనులు ఎక్కువై విద్యాబోధన కుంటుపడుతోందని విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు పాఠశాలలు ప్రచార వేదికలుగా మార్చరాదని యుటిఎఫ్ నేతలు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. పాలకొల్లు పట్టణ పరిధిలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నోడల్ ఆఫీసర్లుగా నియమించారని, దీనివల్ల పాఠశాలలో విద్యాబోధనకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, దీంతో ఉపాధ్యాయులను నోడల్ ఆఫీసర్లుగా వెంటనే తొలగించాలని వారు కోరారు. యుటిఎఫ్ పట్టణ అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి డి.ఏసుబాబు, జి.లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్వరరావు, దుర్గారావు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు గడపగడపకూ వైసిపి

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల ఐదో తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు నరసాపురం పట్టణంలోని 25వ వార్డు కంబళ్లవారివీధి నుండి గడప గడపకూ వైసిపి, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంఎల్ఎ, వైసిపి నేత ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు మంత్రి నారా లోకేష్ పర్యటన

ఏలూరు:రాష్ట్ర పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల ఐదో తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పోడూరు మండలం జిన్నూరు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.15 గంటలకు పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు యలమంచిలి మండలం అడవిపాలెం గ్రామంలో 15 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు యలమంచిలి మండలం శిరగాలపల్లి, పాలకొల్లు నుండి దొడ్డిపట్ల మీదుగా శిరగాలపల్లి, యలమంచిలి లంక ఆర్‌అండ్‌బి రోడ్డును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు కట్టుపాలెం వద్ద రూ.కోటీ 20లక్షలతో నిర్మించిన కట్టుపాలెం నుండి యలమంచిలి లంక రోడ్డును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.15 గంటలకు పాలకొల్లులో జరిగే జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో పాల్గొం టారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు నరసాపురం బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం 3.45 గంటలకు నరసా పురంలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును ప్రారం భించి, అనంతరం మొగల్తూరులో తాగునీటి పథకాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా వెళతారు.

ఎఎంసి వస్త్రవ్యాపారంలో అవకతవకలు : వైసిపి

పాలకొల్లు:పాలకొల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రతివారం జరిగే వస్త్రాల వ్యాపారంలో అధికారులు, పాలకవర్గం భారీగా సొమ్ములను అవకతవకలు చేసినట్లు నియోజకవర్గ వైసిపి కన్వీనర్ గుణ్ణం నాగబాబు ఆరోపించారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 2015 పుష్కరాలకు ముందు పెద్దగోపురం పక్కనే ఉన్న దేవునిహాలులో ప్రతి శుక్ర, శనివారాల్లో పెద్ద ఎత్తున హోల్‌సేల్ వస్త్రవ్యాపారం నిర్వహించేవారని, అయితే పుష్కరాల సందర్భంగా దేవునిహాలుని తొలగించడంతో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సూచనల మేరకు మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయితే ప్రతి వర్తకుడు దేవునిహాలులో రెండు రోజులకు రూ.130 మాత్రమే చెల్లించేవారని, ఎఎంసిలో రూ.250 చెల్లిస్తున్నారని చెప్పారు. 120 మంది వ్యాపారులు మార్కెట్‌యార్డులో వ్యాపారం చేస్తున్నారని, ప్రతీవారం రూ.250 చొప్పున నెలకు రూ.1000, మొత్తం 120 మంది ప్రతీవారం రూ.30వేలు చొప్పున ఇలా గత 30 నెలల్లో రూ.36 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. అయితే మార్కెట్‌యార్డు వారు నెలకు రూ.నాలుగు వేలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు గత 30 నెలల్లో కేవలం రూ.లక్షా 20వేలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు చూపించారని, అంటే గత 30 నెలల్లో రూ.34 లక్షల 80 వేలు అవకతవకలు జరిగినట్లు ఆయన వివరించారు. మార్కెట్ యార్డుకు జమకావాల్సిన రూ.34.8 లక్షలు వ్యవసాయ మార్కెట్ కమిటీ, అధికారులు పెద్ద ఎత్తున దుర్వినియోగం చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకర్, గుణ్ణం సర్వారావు, దేవరపు మల్లేశ్వరరావు, బోనం బులివెంకన్న, దేవ దుర్గాప్రసాద్, కమిలి ప్రసాదరాజు, కర్ణి జోగయ్య, పొనుకుమట్ల వీరాస్వామి, విప్పర్తి నవీన్, నున్నబోయిన వెంకటేశ్వరరావు, కోరాడ శ్రీను, ఉచ్చుల స్టాలిన్, వెంకటరమణ పాల్గొన్నారు.

గజల్ శ్రీనివాస్‌ను సమర్ధించడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - పాలకొల్లు

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన గజల్ శ్రీనివాస్‌కు వత్తాసుపలుకుతున్న దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావును మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని ఆచంట మాజీ ఎంఎల్ఎ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ రాష్ట్ర గవర్నర్‌ను, ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. గజల్ శ్రీనివాస్ చర్యలను ఖండించకపోగా ఆయనకు మద్దతుగా నిలబడడం సిగ్గుచేటని విమర్శించారు. గజల్ శ్రీనివాస్ చర్యలు మహిళా లోకానికి అవమానకరమన్నారు.


ఆత్మగౌరవ దీక్ష ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మరుగుదొడ్డి తప్పనిసరి

ప్రజాశక్తి - ఆచంట

ప్రతీకుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని వల్లూరు సర్పంచి బండి హైమావతి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 'చెంబు చచ్చింది ఆత్మగౌరవం బతికింది' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి బహిరంగ మలవిసర్జన వల్ల వచ్చే అనర్థాలు, ఆరోగ్య సూత్రాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి మైలే ఏసురత్నం, ఉపాధ్యాయుడు కొప్పిశెట్టి మచేను, రాయుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి అర్హునికీ పింఛను

ఆచంట:ఆచంట వేమవరం గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు సర్పంచి కనపాల స్వర్ణకుమారి అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కుక్కల రాజేంద్రప్రసాదరావు, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలుంటే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామసభల అనంతరం జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సర్పంచి స్వర్ణకుమారి మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఎఇ డి.రాజు, స్థానికులు బికెడి.సత్యనారాయణ, దొంగ నాగార్జున, కోరం సాల్మన్‌రాజు, కనపాల వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించండి

పాలకొల్లు: ఈనెల ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా జరిగే స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో పాలకొల్లు పురపాలక సంఘం పోటీపడుతోందని, ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ పరిశుభ్రత, పచ్చదనానికి కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి కోరారు. పట్టణంలోని స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదని స్వచ్ఛ సర్వేక్షన్ అంశాలను విద్యార్థులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే స్వచ్ఛాంధ్ర, ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని, తద్వారా పాలకొల్లు పట్టణం దేశవ్యాప్తంగా మంచి ర్యాంకు సాధించగలదని చెప్పారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపల్ కెఎస్‌కె.రాజబాబు, సూపర్‌వైజర్ సిహెచ్.రామారెడ్డి, ఎన్ఎస్-ఎస్ కో ఆర్డినేటర్ విఎన్.లక్ష్మణకుమార్, మున్సిపల్ మేనేజర్ పద్మావతి పాల్గొన్నారు.

'ప్రజాసమస్యల పరిష్కారానికే 'జన్మభూమి - మా ఊరు"

ప్రజాశక్తి - ఆచంట

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 'జన్మభూమి - మా ఊరు'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని వల్లూరు సర్పంచి బండి హైమావతి అన్నారు. వల్లూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సభలో హైమావతి మాట్లాడుతూ రూ.ఐదు కోట్లతో వల్లూరు పంచాయతీని అభివృద్ధి చేశామన్నారు. ఆచంట నియోజవకర్గంలో వల్లూరు పంచాయతీ అభివృద్ధిలో రెండోస్థానంలో నిలిచి అవార్డు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15వేలు ప్రోత్సాహం అందిస్తోందని, ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి మైలే ఏసురత్నం, ఎంపిటిసి పెచ్చెట్టి సత్యనారాయణ, కార్యదర్శి రాయుడు సత్యనారాయణ, విఆర్ఒలు డిఎన్‌వి.చలం, ఎ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కొప్పిశెట్టి మచేను, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోడూరు:ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఇఒపిఆర్‌డి డి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వద్దిపర్రు గ్రామంలో జన్మభూమి - మాఊరు కార్యక్రమం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి గెద్దాడ భవానీప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులచే వ్యక్తిగత మరుగుదొడ్ల ప్రాముఖ్యతను వివరిస్తూ నాటికను ప్రదర్శించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ డి.శేషుప్రసాద్, డిటి సాహెబ్, ఎంపిటిసి శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు. (ప్ర.వి)

యలమంచిలి:అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకే జన్మభూమి మా ఊరు కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని చింతదిబ్బ, కాంబోట్లపాలెం, బూరుగుపల్లి, మట్లపాలెం, నేరేడుమిల్లి, గంగడపాలెం గ్రామాల్లో జన్మభూమి సభలు ఆయా గ్రామాల సర్పంచులు చెల్లుబోయిన రమ్య, గెద్దాడ లక్ష్మీపార్వతి, గోనిపాటి భాస్కరకుమారి, కొండేటి లక్ష్మి, పెచ్చెట్టి మణీశ్వరి, ముదునూరి రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగాయి. నేరేడుమిల్లి గ్రామ సభలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పాల్గొని అర్హులైన వారికి పింఛన్లు, రుణమాఫీ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, బోనం నాని, ఎంపిపి బొప్పన సుజాత, తహశీల్దార్ వి.స్వామినాయుడు, ఎంపిడిఒ ఆర్‌సి.ఆనందకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ సురేష్‌బాబు, నాయకులు చిట్టూరి సీతారామంజనేయులు, ఆరిమిల్లి రామశ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.(ప్ర.వి)

నరసాపురం : పట్టణంలోని 10, 11, 12,9, 14 వార్డుల్లో జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ వార్డులకు సంబంధించిన కౌన్సిలర్లు సభ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పాల్గొన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పసుపులేటి రత్నమాల, కౌన్సిలర్లు అధికారి అనంత రామారావు, తుమ్మలపల్లి వెంకటరమణ, భూసారపు రాఘవమ్మ, పెమ్మాడి శ్రీదేవి, ద్వారా శ్రీసత్య శివప్రసాద్, శశిదేవి, అబేదా సుల్తానా, బళ్ల వెంకటేశ్వరావు, కొప్పాడ రవీంధ్రనాథ్, అధికారులు పాల్గొన్నారు. (ప్ర.వి)



మాట్లాడుతున్న శశి విద్యాసంస్థల ఛైర్మన్ వేణుగోపాలకృష్ణ

శశి ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు

మంజూరు చేసిన యుజిసి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలోని శశి ఇంజినీరింగ్ కళాశాలకు యుజిసి అటానమస్ (స్వయం ప్రతిపత్తి) ఇచ్చిందని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఆ కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు ఎన్‌బిఎ, నాక్ గుర్తింపు ఉందని, వీటితో పాటుగా అటానమస్ సౌకర్యం కల్పించినట్లు యుజిసి నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పదేళ్లపాటు తమ కళాశాలకు ఈ అటానమస్ గుర్తింపు ఉంటుందని తెలిపారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తికి సంబంధించి మొదటిసారి ఐదు నుంచి ఆరేళ్ల పాటు మంజూరు ఉంటుందని అన్నారు. తమ కళాశాలలోని విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించిన యుజిసి పదేళ్లపాటు స్వయంప్రతిపత్తి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడం వల్ల అకడమిక్ సంవత్సరాన్ని సక్రమంగా నడిపించేందుకు వీలు కలుగుతుందన్నారు. గుర్తింపు పొందిన పరిశ్రమలకు అనూకులంగా కోర్సులను మార్పుచేసి శిక్షణ ఇస్తామని తెలిపారు. దీనివల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భానుప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ సిహెచ్.శేషుబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే జిల్లాకు ప్రత్యేకస్థానం

రాష్ట్ర సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్

పాలకోడేరు: రాష్ట్రంలో జిల్లాకు ప్రత్యేకస్థానం ఉందని, ప్రభుత్వం ఏ కార్యక్రమం నిర్వహించినా ఇక్కడి నుంచే ప్రారంభిస్తుందని రాష్ట్ర సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్, రాష్ట్ర జన్మభూమి ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోరుకోల్లు గ్రామంలో గురువారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి ఒడిఎఫ్ జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. ఎంఎల్ఎ శివరామరాజు మాట్లాడుతూ అంగన్‌వాడి, మండల సమాఖ్య, పిహెచ్‌సి సబ్ సెంటర్, పశు వైద్యశాల భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మైప గ్రామంలో మధ్యాహ్న భోజన వంటషెడ్డును ప్రారంభించారు.

టూరిస్టు బస్ సీజ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం వద్ద ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఓ టూరిస్టు బస్‌ను సీజ్ చేశామని జంగారెడ్డిగూడెం రవాణాశాఖాధికారి సిహెచ్.వెంకటరమణ తెలిపారు. బస్సుకు టాక్స్ చెల్లించకుండా హైదరాబాదు - కాకినాడ మధ్య నడుపుతున్న టూరిస్ట్ బస్‌ను సీజ్ చేశామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ట్రావెల్స్ నిర్వహించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ నిబంధనల మేరకు బస్సులను నడపాలని, పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించకూడదని ఆయన తెలిపారు. అలా కాదని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి వాహనదారులు తమవద్ద కచ్చితమైన ఆధారాలు ఉంచుకోవాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అలిగిన ప్రజాప్రతినిధులు

సభనుంచి వెళ్లిపోయిన జెడ్‌పిటిసి, వైస్ ఎంపిపి, టిడిపి మండలాధ్యక్షుడు

ప్రజాశక్తి- జీలుగుమిల్లి

ఏజెన్సీలో తరతరాలుగా జీవిస్తూ ఇళ్లు కట్టుకోవటానికి అవకాశం లేకుండా ఇబ్బందులు పడుతున్న గిరిజనేతరులకు తప్పనిసరిగా ఇల్లు కట్టిస్తామని, మాటతప్పితే తనకు ఓటు వేయొద్దని పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని స్వర్ణవారిగూడెం, దర్భగూడెం పంచాయతీల్లో గురువారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. దర్భగూడెం సభలో మాట్లాడుతూ జీలుగుమిల్లి నుంచి దేవరపల్లి వరకూ నాలుగులైన్ల రోడ్డు మంజూరైందన్నారు.

మాకు గుర్తింపు లేదు : జెడ్‌పిటిసి

మండలంలో జెడ్‌పిటిసిగా ఎన్నికైన తనకు అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని జెడ్‌పిటిసి సభ్యులు రాజబాబు అన్నారు. ఈ మేరకు ఆయన దర్భగూడెం జన్మభూమి సభ నుండి నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. ఆయనతో పాటుగా వైస్ ఎంపిపి గూడపాటి అరుణకుమార్, పార్టీ మండలాధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం వేదిక నుంచి వెళ్లిపోయారు. మండలంలో జన్మభూమి సభలు ప్రారంభమై మూడు రోజులు కావస్తున్న ఎంపిడిఒ ఇప్పటికీ సమాచారం ఇవ్వలేదని ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంఎల్ఎ ఎంపిడిఒ అన్నపాలినను పిలిపించి ప్రశ్నించారు. దానికి ఆయన మాట్లాడుతూ జెడ్‌పిటిసి, ఎంపిపికి సమాచారం జూనియర్ అసిస్టెంట్ ద్వారా అందించామన్నారు. దీంతో సభ తర్వాత మాట్లాడుదామని వారిద్దరికీ ఎంఎల్ఎ నచ్చజెప్పారు. అయినా వారు కార్యక్రమంలో పాల్గొనలేదు.

11 నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కలగంపూడి గ్రామంలో ఈ నెల 11, 12, 13, 14వ తేదీల్లో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను ముదునూరి సత్యనారాయణరాజు స్మారకార్థం నిర్వహించనున్నట్లు కలగంపూడి పంచాయతీ సర్పంచి పొత్తూరి బుచ్చిరాజు తెలిపారు. గురువారం కలగంపూడి గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పోటీలు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం ఏడు జట్లు పాల్గొంటాయని, విజేతలకు రూ.రెండు లక్షలు బహుమతి అందిస్తామని, దాంతో పాటుగా షీల్డులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెడుగుడు పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు గుబ్బల వేణు, కల్యాణం గంగాధరరావు, ఉచ్చుల స్టాలిన్ పాల్గొన్నారు.

గజల్ అలాంటి వాడని తెలియదు

వీడియోలు చూసిన తర్వాత నిజస్వరూపం తెలిసింది - నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నా : రాష్ట్ర మంత్రి మాణిక్యాలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గజల్ శ్రీనివాస్ వ్యవహారం జుగుప్సాకరంగా ఉందని, అతడిని కఠినంగా శిక్షించాలని, బాధితులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజల్ శ్రీనివాస్ మహిళల పట్ల వ్యవహరించిన తీరు తనకు తెలియకపోవడం వల్ల, అతని అశ్లీల వీడియోలు చూడకపోవడం వల్ల విజయవాడలోని రాష్ట్ర అతిధిగృహంలో తాను విలేకర్లతో మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ మంచివాడని, గజల్స్‌తో అద్భుతమైన ప్రతిభను కనబరుస్తారని సమర్థిస్తూ మాట్లాడినట్లు ఆయన తెలిపారు. అతను చేసిన అకృత్యాల వీడియోలు చూసిన తర్వాత చూసిన తర్వాతే అతని చీకటికోణం బయటపడిందని అన్నారు. అతనికి అనుకూలంగా తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. మహిళలను లోబరుచుకోవడం, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడం దారుణమని అ అన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల సమాజం సిగ్గు పడుతుందన్నారు. ఓ కోణంలో తన గజల్స్ ద్వారా సమాజానికి మంచి పాటలు అందించారని అన్నారు. మరో కోణంలో శ్రీనివాస్ మహిళలను లోబరుచుకోవడం క్షమించరాని నేరమని అన్నారు. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కనకదుర్గమ్మ ఆలయ వ్యవహారంపై 48 గంటల్లో విచారణ పూర్తి

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అర్ధరాత్రి సమయంలో నిర్వహించిన పూజల వ్యవహారంపై 48 గంటల్లో విచారణ పూర్తి చేస్తామని, ఈ వ్యవహారంలో ఏస్థాయి వ్యక్తులు ఉన్నా వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనకదుర్గమ్మ ఆలయంలో అర్ధరాత్రి పూజలు నిర్వహించారని, ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహించారని, దీనిపై విచారణ కమిటీని, దేవాదాయ శాఖ నుంచి ఆగమన పండితులతో కమిటీని నియమించామని తెలిపారు. ఈ కమిటీలు 48 గంటల్లో నివేధిక అందిస్తాయని చెప్పారు. నివేధిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆలయంలో క్షుద్రపూజలు నిర్వహించలేదని తెలిపారు. వేరే దేవాలయాలకు చెందిన వ్యక్తులు రావడం సమంజసం కాదని, అలా వారు రావడానికి ఎవరు కారణమనే దానిపై నివేధిక ఆధారంగా చర్యలుంటాయని అన్నారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్, మంత్రిగా తాను ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పరిస్థితిని వివరించామని, సిఎం దీనిపై లోతుగా విచారించాలని ఆదేశించారని తెలిపారు. యాత్రికుల మనోభావాలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి తెలిపారని పేర్కొన్నారు. దుర్గగుడికి సంబంధించి బ్లూ బుక్ అనే కమిటీని శృంగేరి మఠ పిఠాధిపతి ఆధ్వర్యంలో నియమించామని తెలిపారు. దుర్గగుడి ఆలయానికి సంబంధించి నిత్య కార్యక్రమాలు బ్లూబుక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, నరిసే సోమేశ్వరరావు పాల్గొన్నారు.

అన్యాయం చేస్తుంటే అడ్డుకోరేం?

ధర్భగూడెం జన్మభూమి సభలో మొడియంను అడ్డుకున్న గిరిజనులు - బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చడంపై నిరసన



ఎంఎల్ఎ మొడియంతో మాట్లాడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చి గిరిజనులకు అన్యాయం చేయాలని ప్రభుత్వం చూస్తుందని, ఈ విషయంపై గిరిజన ఎంఎల్ఎ అయి ఉండి కూడా ఎందుకు నోరు మెదపడం లేదనే దానిపై సమాధానం చెప్పాలని పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావును గిరిజనులు నిలదీశారు. మండలంలోని దర్భగూడెం జన్మభూమి సభకు వచ్చిన ఆయనను సభా ప్రాంగణం వద్ద గిరిజనులు గురువారం అడ్డుకున్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం పెడుతుంటే ఎందుకు దానిపై మాట్లాడలేదని గిరిజనులు ప్రశ్నించారు. గిరిజనులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని నిలదీశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గిరిజనులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రితో గిరిజన ఎంఎల్ఎలంతా కలిసి మాట్లాడామని తెలిపారు. అవసరమైతే గిరిజన సంఘాల నాయకులను ముఖ్యమంత్రి వద్దకు నేరుగా తీసుకెళ్తామని చెప్పారు. ఏజెన్సీలో ఉన్న గిరిజనులకు ప్రస్తుతం అమలయ్యే రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు. గిరిజనులకు అన్యాయం జరగకుండా రిజర్వేషన్లు పెంచే ఆలోచనలు ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గర్జన సంఘం నాయకులు పండు నారాయణ పాల్గొన్నారు.

మోటారు వాహనాల చట్టసవరణ బిల్లు రద్దు చేయండి

ఏలూరు డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యాన ధర్నా



బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యాన స్థానిక ఏలూరు డిపో వద్ద గురువారం కార్మికులు ధర్నా నిర్వహించారు. సవరణ బిల్లు కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య మాట్లాడుతూ మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదానికి పెట్టనున్నట్లు తెలుస్తుందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా రవాణారంగ కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తున్నా, వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ బిల్లులో ఆర్‌టిసికి ఉన్న ప్రత్యేక సదుపాయాలను, హక్కులను రద్దు చేసే ప్రతిపాదనలు ఉన్నాయని, ఆర్‌టిసి సేవలను నాశనం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయి గానీ ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. ఊబర్, ఓలా వంటి సంస్థల చేతుల్లోకి ప్రజా రవాణా వెళ్లిన తర్వాత ప్రమాదాలు మరింత పెరుగుతాయని తెలిపారు. రవాణా ఛార్జీలు కూడా అనేక రెట్లు పెరుగుతాయని చెప్పారు. యూనియన్ రీజనల్ కార్యదర్శి టిపిఆర్.దొర మాట్లాడుతూ ప్రజలను మరింత కష్టాలు చేసే వినాశకర బిల్లును ఆమోదించొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఎం.అరుణకుమారి, జి.జయరాజు, పివి.రమణ, సిహెచ్.శ్రీనివాసరావు, టిఎస్‌వి.ప్రసాద్, సిహెచ్.ప్రసాద్, యు.ఉమా మహేశ్వరి, ఎ.ప్రసాద్, టి.రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.